జన రాజకీయం కోసం ...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 5 సంచిక - 04 పక్షపత్రిక ఫిబ్రవరి 16-28, 2014

## ఢిల్లీలో జేపీపై టీ-న్యాయవాదుల దాడి

## రాష్ట్రంలో వెల్లువెత్తిన నిరసనలు...



## ఢిల్లీలో జేపీపై దాడిని ఖండిస్తూ... రాష్ట్రంలో వెల్లువెత్తిన నిరసనలు...



హైదరాబాద్- ట్యాంక్‌బండ్ వద్ద ధర్నా...



హైదరాబాద్ -ఇందిరాపార్క్ వద్ద ధర్నా...



చిలకలూరిపేటలో...



రామచంద్రపురంలో...



చీపురుపల్లిలో...



చింతలపూడిలో...



కూకట్‌పల్లిలో...



నెల్లూరులో...

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక ఫిబ్రవరి 16-28, 2014

సంపుటి - 5 సంచిక - 04

## లోపలి పేజీల్లో...

రాష్ట్ర ఓటాన్ అకౌంట్ బడ్జెట్....................6

రాష్ట్ర సామాజిక ఆర్థిక సర్వే.......................12

పునర్విభజన బిల్లుపై జేపీ........................13

లోక్‌సత్తా పార్టీ జిల్లా స్క్రీనింగ్ కమిటీలు....17

అసర్ సర్వే-2013 .............................18

అంతర్జాతీయ మహిళాదినోత్సవం...........23

ఢిల్లీలో జేపీపై దాడి...............................24

రాష్ట్రంలో వెల్లువెత్తిన నిరసనలు ............25

జిల్లా వార్తలు .....................................30

## సంపాదక వర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు

డి.వి.వి.యస్. వర్మ
సంపాదకులు

### సంపాదక వర్గం

పి. రవిమారుత్

బండారు రామ్మోహన్‌రావు

ఓంకార్

డా॥ ఆలూరి విజయలక్ష్మి

కె.వి. కుటుంబరావు

బుక్ & కవర్ డిజైన్ : వి. శ్రీలత

ఫోటోలు : ఎస్. సందీప్ కుమార్

# ఈ పక్షం చాట్ మసాలా

**1. స్క్రిప్ట్ సారథి**
"కాంగ్రెస్ ప్రచార సారథిగా సోనియా"
**ప్రచార సారథి రెడీ... ఇక స్క్రిప్ట్ రెడీ చెయ్యండి**

**2. ముంపు ఫ్రంటు**
"కాంగ్రెస్‌ను రక్షించేందుకే మూడో ఫ్రంటు" - నరేంద్రమోడీ
**మూడో ఫ్రంటు కాదు.. ముంపు ఫ్రంటు.. ముంచుతుందేమో చూసుకోండి**

**3. వాయిదా మరణం**
"కారుణ్య మరణాలపై సుప్రీం తీర్పు వాయిదా"
**వాయిదాలకు మరణం లేదు.. కారుణ్యానికి తీర్పు లేదు**

**4. హామీల కలలు**
"హామీల అమలులో వైఫల్యం కుదరదు" - సుప్రీం కోర్టు
**ప్రభుత్వ హామీలు ప్రాథమిక హక్కులు కావు, ఆదేశిక సూత్రాలేనంటున్నారు.**

**5. కేజ్రీ క్విట్**
"జనలోక్‌పాల్ ఆమోదం పొందకుంటే తప్పుకుంటా" - ముఖ్యమంత్రి కేజ్రీవాల్
**చెరువు మీద అలిగి నీళ్లు తాగడం మానేసినట్లుంది**

**6. దురాశ**
"రాహుల్‌ని కలిసిన సివిల్స్ ఆశావహులు"
**పాపం ఆయనకే ఎన్నికల మెయిన్స్ పరీక్ష మీద ఆశలేదు - మీకేం చెబుతారు.**

**7. లాంగ్ స్టే**
"చంద్రబాబుకు ఢిల్లీలో ఏం పని" - నాగం
**మీకేం పనో.. ఆయనకీ అదే - మీకు ఒకటి చాలు ఆయనకి రెండు కావాలి. అందుకే లాంగ్ స్టే**

**8. శీలం నారాయణ**
"వై.కా.పా తో సి.పి.యం పొత్తు అక్రమ సంబంధం" - సి.పి.ఐ. నారాయణ
**ఇతరులకు శీలపరీక్ష బాగానే వుంది - స్వశీల పరీక్ష కూడా వుండాలి గదా**

**9. కొత్త పూజారి**
"అధికారంలోకి రాగానే నాలుగు సంతకాలు" - జగన్
**కొత్త పూజారి గదా.. నాలుగు సంతకాలు ఆరు కుడ్ ప్రో కూలు**

**10. క"రుణం"**
"మేము జీవితమంతా సోనియాకు రుణపడి వుండాలి" - మంత్రి డొక్కా
**మంత్రి పదవి ఆమె కరుణం - మీది జీవిత రుణం**

**11. అసలు - నకిలీ**
"కాంగ్రెస్ దొంగ నాటకాలు" - కిషన్‌రెడ్డి
**తమది అసలు.. వారిది నకిలీ - నాటకానికి తెర ఏదైతేనేం**

**12. వీడిపోయే కాలం**
"కాంగ్రెస్‌ది పోయేకాలం" - యం.పి. రాయపాటి
**వారిది పోయేకాలం - తమది వీడిపోయే కాలం**

**13. ఇద్దరూ ఇద్దరే**
"కాంగ్రెస్-టి.ఆర్.ఎస్‌ల అనుబంధాన్ని ఎవరూ తెంచలేరు" - డి.యస్.
**ఈ మాట కేసిఆర్‌ని అడిగి చెప్పండి.** ❖❖❖



# కార్టూన్ కార్నర్

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**

*8-2-674బి/2/9, ప్లాట్ నం : 93*
*హ్యాపీ వ్యాలి, రోడ్ నం. 13ఎ,*
*బంజారాహిల్స్, హైదరాబాద్ - 500 034*

**ఫోన్ నంబర్లు :**
***040- 23311817, 23311819, 23311820, 23312829***
**ఫ్యాక్స్ : *040-23310612***
accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040-23311817**

విడి ప్రతి : రు. *10* ,
ఏడాది చందా : రు. *200*
మూడేళ్ళ చందా : రు. *500*

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: *62007167836* ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

# వారసులొస్తున్నారు... జాగ్రత్త

సంపాదకీయం

యువ ప్రభంజనం పేరుతో నారాలోకేష్ ప్రారంభిస్తున్న సైకిల్ యాత్రతో తెలుగుదేశం పార్టీలో వారసత్వం ఖరారైంది. యన్.టి.ఆర్. కుటుంబం చుట్టూ నడిచిన ఈ పార్టీ ఇప్పుడు చంద్రబాబు కుటుంబ పార్టీగా స్థిరపడింది. గతంలో యన్.టి.ఆర్. ఒకసారి తనకు బాలయ్య వారసుడని ప్రకటించి మనసులో మాట బైట పెట్టారు. చంద్రబాబు చాకచక్యంగా రామారావు కుటుంబ సభ్యుల్ని అవసరాన్ని బట్టి వాడుకుంటూ వచ్చారు. బాలయ్యను వియ్యంకుణ్ణి చేసుకుని కీలక అడ్డంకిని తొలగించి లోకేష్‌కు మార్గం సుగమం చేశారు. అలాంటి ఎత్తులు పైఎత్తులతోనే జూనియర్ యన్.టి.ఆర్ ను కట్టడి చేశారు. ఈ ఎన్నికల్లో లోకేష్‌ను ప్రచారసారధిగా, వ్యూహకర్తగా, ప్రజా నాయకుడిగా చూపెట్టడానికి యువ ప్రభంజనం నాంది కానుంది.

వై.కా.పా. పుట్టడమే వారసత్వ పార్టీగా, కుటుంబ పార్టీగా పుట్టింది. తన తండ్రి స్థానం తనకు హక్కు అంటూ కొత్త పార్టీని జగన్ ఏర్పాటు చేసుకున్నారు. తాను అధ్యక్షుడైతే తల్లి గౌరవాధ్యక్షురాలుగా ఆ పార్టీని రూపొందించారు. రాజకీయంగా చాలా అనుభం వున్న వారు ఎందరో ఆ పార్టీలో చేరినా వారందరిని ఉత్సవ విగ్రహాలను చేసి తానే సర్వస్వంగా వ్యవహరించారు. జైలు పాలైనప్పుడు కూడా వ్యవహారం విజయమ్మ పేరు మీదే నడిపించారు. ప్రచారాన్ని తల్లి, భార్య, చెల్లికి అప్పగిస్తే అందులో ప్రచారకురాలుగా పై చేయి సాధించింది. జైలు నుంచి రాగానే చెల్లిని పక్కన పెట్టాడు. ఎందుకంటే వారసత్వం తనకీ, భార్యకీ, పిల్లలకేగాని చెల్లికీ, ఇతరులకీ చెందదన్నదే సారాంశంగా కనిపిస్తున్నది.


ఇక తె.రా.స. పార్టీ అధినేత చంద్రశేఖరరావు తన పార్టీని ఒక రాజకీయ పార్టీగా ఏనాడూ నడపలేదు. పార్టీ యంత్రాంగం, నిర్ణయాధికారం సర్వం తానేగా వ్యవహరించారు. క్రమేపీ కొడుకు, మేనల్లుడు, కూతురు రాజకీయంగా అందివచ్చారు. ఆ పార్టీ ఎన్ని ఉద్యమాలు చేసినా, చేస్తున్నా పూర్తిగా కుటుంబ పార్టీగానే వ్యవహరిస్తున్నది. ఇక్కడా మళ్లీ అలాంటి తగాదాలే. వారసులు కొడుకా, కూతురా అన్న మీ మాంసలో కుటుంబ కలహం రాజుకుంటున్న ఛాయలు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి.

ఇక కాంగ్రెస్ పార్టీ జాతీయ స్థాయిలో కుటుంబపార్టీగా తరతరాలుగా సాగుతున్న విషయం అందరికీ తెలిసిందే. సోనియాగాంధీ తర్వాత కూతురా, కొడుకా అన్న సమస్య కొంత ఊహాగానాలు సాగిన కొడుకే అవుతాడన్నది అనుహ్యం కాదు. అదే జరిగింది.

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీది ఒక కొత్త తరహా వారసత్వం. ఇది రాష్ట్రంలోని అన్ని పార్టీలకూ వర్తిస్తుంది. జిల్లాలలో నియోజకవర్గాలలో కొన్ని కుటుంబాలే పాలకపక్షంగా ప్రతిపక్షంగా పాలిస్తున్నాయి. ఈ కుటుంబాల నుండి స్థానిక వారసత్వ పిల్ల నాయకులు పుట్టుకొస్తున్నారు. వయసు పైబడింది తప్పుకోండి అంటే అబ్బాయి తయారుగా వుంటాడు. మహిళ కావాలంటే భార్య, కూతురు, కోడలు తయారుగా వుంటారు.

ఇలా రాష్ట్రంలో సంప్రదాయ పార్టీలన్నీ కుటుంబ పార్టీలయ్యాయి. ఆ కుటుంబాల స్వంత ఎస్టేట్లు అయ్యాయి. ఈ ప్రయివేటు ఎస్టేట్ల నుండి వారసులే పుట్టుకొస్తారు. ప్రజా నాయకులు పుట్టుకురారు. అలా కావాలని ఆ పార్టీలలో ఎవరైనా భావిస్తే వారిని వదిలించుకుంటారేగాని కౌగిలించుకోరు. రాష్ట్ర రాజకీయం అవినీతిమయం కావడానికి, కుళ్లి కంపు గొట్టడానికి, అసమర్థులే నేతలుగా చెలామణి కావడానికి ఈ కుటుంబ పార్టీల వ్యవస్థే కారణం.

ఇప్పుడు కోటిమందికి పైగా కొత్త ఓటర్లు వచ్చారు. ఈ యువ ఓటర్లు యువ నాయకత్వాన్ని ఆశించడం సహజం. ఈ ఓటర్లు మార్పును కోరుతున్నారు. మంచి పరిపాలన కోరుతున్నారు. రాజకీయంలో నాయకులుగా ఎదగాలని కోరుకుంటున్నారు. వారికి ఈ కుటుంబ పార్టీలు తమ వారసుల్ని యువ నేతలుగా చూపిస్తున్నారు. అందుకే వారసులొస్తున్నారు.. జాగ్రత్త. వాళ్లకి కొత్త తరం యువత బోయీలుగా మారకూడదు. వాళ్లు మార్పుతెచ్చే వాళ్లు కాదు. మార్పుకి అడ్డంగా నిలిచేవాళ్లు.. వాళ్లని వదిలించుకుంటేనే నిజమైన నాయకత్వం యువతకు దక్కుతుంది. రాష్ట్రంలో మార్పు సాధ్యం అవుతుంది. ♦



# ప్రాంతీయ ఆందోళనలున్నా జిల్లాల వారీ బడ్జెట్, తలసరి కేటాయింపులు ఏవీ?: జేపీ

రాష్ట్రాన్ని దివాళాతీయించేలా ఎన్నికల వాగ్దానాలు ఓ పక్క వెల్లువెత్తుతూ, మరోపక్క తమకు అన్యాయం జరిగిందని, ఉపాధి అవకాశాలు, పరిశ్రమలు, అభివృద్ధి లేదని తెలుగునాట అన్ని ప్రాంతాలలోని ప్రజలు ఆగ్రహాందోళనలతో ఉన్న కీలక సమయంలో రూ. 1,83,129 కోట్లతో శాసనసభలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్ 2014-15ను ఎటువంటి కసరత్తును చేయకుండా, దశదిశ లేకుండా యధాతథ స్థితిని కొనసాగించేదిగా తయారుచేశారని లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాజకీయం అంటే బడ్జెట్, విధానాలు, వాటి ద్వారా వచ్చే ఫలితాలని, జిల్లాలవారీగా, ప్రాంతాలవారీగా బడ్జెట్‌లో కేటాయింపులు చేసివుంటే, ప్రజలకు అంకెలు, అభివృద్ధి వివరాలు స్పష్టంగా అర్థమై ఉండేవని అన్నారు. 2012-13 తుది లెక్కల ప్రకారం చూస్తే, 2014-15లో పన్నుల వాటా, గ్రాంట్లు ద్వారా కేంద్ర ప్రభుత్వ సాయం సుమారు రూ. 48,900 కోట్లుగా చూపారని, అంటే రెండేళ్లలో రూ. 20,000 కోట్ల మేర కేంద్రసాయం పెరిగిందని, రాష్ట్ర ప్రభుత్వం తన వనరుల్ని కాకపోయినా కేంద్రం నుంచి వచ్చే నిధులలో మూడో వంతైనా, గ్రామాలు, పట్టణాలలోని వార్డులకు నేరుగా కేటాయిస్తే తలసరి ప్రతి పౌరునికీ రూ. 2000 వస్తాయని, ఇలా ఐదేళ్లలో రూ. 10,000 రావటం వల్ల స్థానికంగా సమస్యల్ని ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఉన్నతాధికారుల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడకుండా వెంటనే పరిష్కరించుకోగలుగుతారని జేపీ అన్నారు.

> **2014-15**
> **ఓటాన్ అకౌంట్ బడ్జెట్**

**రాష్ట్ర ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌పై లోక్‌సత్తా పార్టీ ప్రధాన కార్యాలయంలో జయప్రకాష్ నారాయణ్ మీడియాతో మాట్లాడుతూ...** జిల్లాలవారీ కేటాయింపుల కోసం రాష్ట్ర శాసనసభలో ప్రతి ఏడాదీ లోక్‌సత్తా గళమెత్తుతున్నా ప్రభుత్వం ఈ కీలకసమయంలో కూడా ఆ మాటను పెడచెవిన పెట్టిందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లుపై లోక్‌సత్తా ఒక్కటే నిర్దిష్టంగా వనరులు, కేటాయింపులు చూపుతూ అన్ని ప్రాంతాలకూ పరిష్కారం చెప్పిందని, ఆ లెక్కలు లేకపోవటం వల్లే సభలో చాలామంది ఎమ్మెల్యేలు సమగ్రంగా మాట్లాడలేకపోయారని అన్నారు. బడ్జెట్ సందర్భంలోనైనా జిల్లాలవారీగా, తెలంగాణ, రాయలసీమ, కోస్తాంధ్ర, హైదరాబాద్ ఇలా ప్రాంతాలవారీగా కూడా లెక్కల్ని క్రోడీకరించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అక్కడక్కడా మాత్రమే అంకెలున్నాయని, వీటిలో కూడా గత ఏడాది ప్రవేశపెట్టిన లెక్కల్నే సవరణలు కూడా చేయకుండా యధాతథంగా పొందుపరిచారని జేపీ అన్నారు. ఇక రాష్ట్ర వనరులపై కొంతకాలం క్రితం లోక్‌సత్తా బైటపెట్టిన అంకెల్నే బడ్జెట్‌లో చూపారని, తాము చెప్పినవి వాస్తవాలని స్పష్టమవుతోందని అన్నారు. గత రెండేళ్లలో రాష్ట్ర ఆదాయం రూ. 36,000 కోట్లు పెరిగిందని చెబుతున్నారని, ఇది ఆరేడేళ్ల క్రితం బడ్జెట్‌తో సమానమని, భారీగా పెరిగిన కేంద్రవనరుల విషయంలోలాగే ఈ లెక్క కూడా నిజమో, కాదో తేల్చుకోవాల్సి ఉందని అన్నారు. ఏ లెక్కన పన్నులు, ఆదాయాలు పెరుగుతున్నాయో పరిశీలించటం అవసరమన్నారు. ప్రణాళికేతర వ్యయం (రోజువారీ ఖర్చులు) ఈ ఏడాది రూ. 30,000 కోట్లు పెరిగిందని, ఇది ప్రమాదకరమన్నారు. ఉద్యోగుల జీతభత్యాల గురించి ప్రస్తావనే లేదని, కానీ కూపీ లాగితే 2014-15లో ఆ ఖర్చు రూ. 52,000 కోట్లుగా కనిపిస్తోందన్నారు.

**పద్దులవారీగా జేపీ మాట్లాడుతూ...** రూపాయికి కిలోబియ్యం, రుణ, వడ్డీ మాఫీలు, ఫీజు రీ ఇంబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, పింఛన్లు తదితర సంక్షేమ కార్యక్రమాలకు ఖర్చు గతంలోలాగే రూ. 28,000 కోట్లుగా పేర్కొన్నారని, అదేసమయంలో మద్యం ద్వారా ఆదాయం యధావిధిగానే

రూ.20,000 కోట్ల పైచిలుకుగానే కనిపిస్తోందని, దీన్ని బట్టి ప్రజలకు ఒక చేత్తో సంక్షేమం పేరుతో తాయిలాలు ఇచ్చి మరో చేత్తో తాగబోయించి మద్యం ద్వారా ఆ డబ్బుల్ని లాక్కునే తప్పుడు రాజకీయాన్నే కొనసాగించాలని ప్రభుత్వం తీర్మానించుకున్నట్టు తెలుతోందన్నారు. ఇదే రాజకీయం, ఇదే విధానం కొనసాగాలాలేదా అని ప్రజలు ఆలోచించాలన్నారు.

**ఎంతో కీలకమైన విద్యకు** ఇవ్వాల్సినంత కాకుండా సుమారు జీఎస్‌డీపీలో సుమారు 3.5శాతం, అంటే, రూ.27,400 కోట్లు మాత్రమే కేటాయించారని, ఆ డబ్బులో కూడా నూటికి 90మంది పిల్లలకు పనికొచ్చే విద్య అందటంలేదనే విషయాన్ని పరిగణలోకి తీసుకుని కేటాయింపులు చేయలేదని అన్నారు. **ఆరోగ్యరంగానికి** ఇచ్చిన రూ.6,750 కోట్లు కూడా ఫైవ్ స్టార్, సూపర్ స్పెషాలిటీలకు మేలు చేయటం తప్ప సామాన్య ప్రజల మీద ఆరోగ్య భారం తగ్గించే తీరుగా లేదన్నారు.

**అత్యంత కీలకమైన విద్యుత్ రంగంలో,** ఇప్పటికే పెంచిన రూ.15,000-20,000 కోట్ల టారిఫ్‌లకు తోడు మరో రూ.8,480 కోట్లు కేటాయించారని, అయితే ఈ మొత్తం డబ్బు కూడా కేవలం విద్యుత్ సంస్థల బకాయిలు తీర్చటానికి తప్ప ప్రజలకు 24 గంటలూ నాణ్యమైన విద్యుత్‌ని తక్కువ ధరకు అందించేందుకు కాదని, పూర్తిగా ప్రజల్ని నాశనం చేసే ఈ విద్యుత్ విధానాన్నే ఇంకా కొనసాగించాలని ప్రభుత్వం భావిస్తోందని జేపీ విరుచుకుపడ్డారు. విద్యుత్ రంగాన్ని బాగుచేయాలంటే, ఎనర్జీ ఆడిటింగ్, హైవోల్టేజీ డిస్ట్రిబ్యూషన్, ఫీడర్లను వ్యవసాయానికి, గృహావసరాలకు, పరిశ్రమలకు వేరు చేయటం, పంపిణీ నష్టాల్ని తగ్గించే ఏర్పాట్లు అవసరమని, ఇందుకు ఏడాదికి రూ.3,000 కోట్లు చొప్పున మూడేళ్లు ఖర్చు పెడితే ప్రభుత్వానికి ఏటా రూ.4,000-5,000 కోట్లు ఆదా అయి, ప్రజల మీద కూడా భారం తగ్గేదని, ఈ ఆలోచనే లేకుండా పూర్తిగా ప్రజల్ని నాశనం చేసేలా విద్యుత్‌రంగం పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. విద్యుత్ ధరల పెంపుపై కాంగ్రెస్, తెదేపా, వైకాపా, టీఆర్ఎస్ పార్టీలు ఈ వాస్తవాలు చెప్పకుండా ప్రజల్ని మోసం చేస్తున్నాయన్నారు. విద్యుత్‌పై ధర్నాలు, ఉద్యమాలు చేసే పార్టీలేవీ ఈ విషయాల్ని చెప్పటంలేదన్నారు. విద్యుత్ పంపిణీ నష్టాల్ని, అవినీతిని ఎలా తగ్గించాలో పశ్చిమ గోదావరి జిల్లా కళ్లచెర్వులో 2005లో లోక్‌సత్తా ఆచరణలో చూపిందన్నారు. లోక్‌సత్తా విధానాన్ని గుజరాత్ ప్రభుత్వం తీసుకుని 24 గంటలూ విద్యుత్‌నిస్తోందిగానీ, మన ప్రభుత్వానికి, పార్టీలకు మాత్రం పట్టటం లేదన్నారు.

**జలయజ్ఞంలో** ఈ బడ్జెట్ కేటాయింపులతో కలిపితే ఖర్చు రూ.1 లక్ష కోట్లు దాకా అవుతుందని, ఇంత చేసినా ఫలితాలేమిటో అగమ్య గోచరంగా ఉందని, దీని మీద లోతైన సమీక్ష జరపాలని జేపీ డిమాండ్ చేశారు. జలయజ్ఞంలో అసంబద్ధతకు, అవినీతికి మచ్చుతునకగా ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు గురించి లోక్‌సత్తా బైటపెట్టిందని, ఇటీవల ఒక ప్రాజెక్టులో రూ.5,000 కోట్లు అక్రమ కేటాయింపు చేసినట్టు పచ్చిగా రుజువులు కనిపిస్తున్నాయని, దీని మీద పూర్తిసాక్ష్యాలు వచ్చాక తెలుస్తామని అన్నారు. వర్షాభావం ఉన్న మెట్టప్రాంతాలలో ఉపాధి కోసం ఉద్దేశించిన **జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం**లో ఇప్పటివరకూ రాష్ట్రానికి వచ్చిన రూ.28,000-30,000 కోట్లతో ఎన్ని టీఎంసీల వర్షపునీరు భూగర్భంలో ఇంకేలా చేశారో చెప్పాలని ముఖ్యమంత్రిని, గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రిని జేపీ సవాలు చేశారు.

**ప్రభుత్వాలు చేయాల్సిన మొట్టమొదటి పని శాంతిభద్రతల**ని, కానీ కేవలం రూ.50-60 కోట్లతో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో నేరపరిశోధనకు కీలకమైన ఫోరెన్సిక్ ల్యాబ్‌లు ఏర్పాటు చేసే అవకాశమున్నా అందుకు కేటాయింపులు లేవన్నారు. నేరాల నివారణకు **సీసీటీవీ కెమేరాలు ఏర్పాటు చేయాలని లోక్‌సత్తా పెద్దఎత్తున ఆందోళనలు చేసినా,** కేంద్రానికి చెబుతామని చేతులు దులుపుకున్నారు తప్ప డబ్బులు ఇవ్వలేదన్నారు. మహిళలపై వేధింపుల్ని తొలిదశలోనే అడ్డుకునేలా చేయగల స్థానిక న్యాయాలయాలను లోక్‌సత్తాయే చట్టంగా సాధించి ఐదేళ్లవుతున్నా, కేంద్రమే డబ్బులిస్తున్నా సద్వినియోగం చేసుకునే ఆలోచనేదీ రాష్ట్ర బడ్జెట్‌లో కనిపించలేదన్నారు. అసంఘటిత రంగంలో, ముఖ్యంగా నిర్మాణ రంగంలో ఉన్న కార్మికుల కోసం ఆరోగ్యబీమాకు నిధులున్నా, చట్టమున్నా కూడా తగినరీతిలో వినియోగించే ప్రయత్నం కరవైందన్నారు. మహిళల రక్షణకు, పేదలను ఆదుకునేందుకు కాకుండా దోపిడీకి, ఓటుబ్యాంకు పథకాలకు మాత్రమే కేటాయింపులు చేశారన్నారు.

**ఎస్.సి, ఎస్.టి ఉపప్రణాళిక** కోసం రాష్ట్రంలో ఎక్కడా జరగని రీతిలో కూకట్‌పల్లి నియోజకవర్గంలోని అన్ని బస్తీల్లో స్థానికులతో కమిటీలు వేసి ఎస్.సి, ఎస్.టి ప్రజల సమస్యలపై నిర్దిష్ట ప్రణాళికను రూపొందించి ఇచ్చి, జనాభా లెక్కన సబ్‌ప్లాన్ ప్రకారం తలసరి వచ్చే రూ.8,000లో కనీసం సగమైనా ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరితే ఇప్పటివరకూ స్పందన లేదని, కేవలం కాగితాలకే పరిమితమవటంతప్ప దళితుల, ఆదివాసీల జీవితాల బాగుచేయటం మీద సర్కారుకి శ్రద్ధ లేదన్నారు.

**కేంద్ర నిధుల్లో మూడో వంతు నేరుగా రాష్ట్రంలో స్థానిక ప్రభుత్వాలకు కేటాయించేలా ప్రణాళికా సంఘంతో చర్చిస్తున్నట్టు** జేపీ తెలిపారు. ఈ బడ్జెట్ ఒక కనువిప్పు కావాలని, మద్యం, పేదరికాన్ని కొనసాగించే విధానాలు, తాయిలాలు, అధికార కేంద్రీకరణ, అవినీతి చుట్టూ తిరిగే ఇలాంటి బడ్జెట్లే వస్తే ఎన్ని రాష్ట్రాలు ఏర్పడినా జనం జీవితాలు బాగుపడవని, ఇందుకు ప్రత్యామ్నాయంగా నాణ్యమైన విద్య, ఆరోగ్యం, విద్యుత్, ఉపాధి, జనం చేతికి పాలన, శాంతిభద్రతలు, మహిళలకు రక్షణ అంశాలతో బడ్జెట్‌ను తెచ్చే శక్తి లోక్‌సత్తాకు మాత్రమే సాధ్యమని, ఎలాంటి రాజకీయం కావాలో ఇది ప్రజలు తేల్చుకోవాల్సిన సమయమని జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

ఈ సమావేశంలో లోక్‌సత్తా పార్టీ ఉపాధ్యక్షులు డి.వి.వి.ఎస్ వర్మ, బండారు రామ్మోహనరావు పాల్గొన్నారు. ◆

# పెరిగిన జీతాల భారం.. ప్రణాళికేతర వ్యయం

**2014-15**
**ఓటాన్ అకౌంట్ బడ్జెట్**

ఉద్యోగుల జీతాలు, పెన్షన్లు, ప్రభుత్వ నిర్వహణ వ్యయం, విద్యుత్ సబ్సిడీ, వడ్డీలు పెరగడంతో ప్రణాళికేతర వ్యయం 13 శాతం పెరిగింది. గతేడాది రూ. 1,01,926 కోట్లున్నది కాస్తా ప్రస్తుత బడ్జెట్‌లో రూ. 13,253 కోట్లు పెరిగి రూ. 1,15,179 కోట్లకు చేరింది. ప్రభుత్వోద్యోగుల జీతాల భారం తడిసి మోపెడైంది. ఇటీవల 27 శాతం మధ్యంతర భృతి (ఐఆర్) ప్రకటించిన నేపథ్యంలో జీతాలు, పెన్షన్లు పెరిగాయి. జీతాల పెంపు వల్ల ఏటా రూ.7,625 కోట్లు, పెన్షన్ల పెంపుతో రూ. 2,308 కోట్ల భారం పడింది. జీతాలు, పెన్షన్లు కలిపి గతేడాది కంటే దాదాపు రూ. 10 వేల కోట్లు పెరిగాయి. రోజువారీ ప్రభుత్వ కార్యకలాపాల విషయానికొస్తే గతేడాది రూ. 14,209 కోట్లున్న నాన్ శాలరీ వ్యయం ఇప్పుడు రూ. 16,517 కోట్లకు పెరిగింది. ప్రభుత్వ నిర్వహణ ఖర్చులో పెరుగుదలను చూపించలేదు. రుణాల చెల్లింపు భారం గతేడాదితో పోలిస్తే కాస్త తగ్గింది. రుణాలపై చెల్లిస్తున్న వడ్డీ రూ. 14,519 కోట్ల నుంచి 16,787 కోట్లకు పెరిగింది. బియ్యంపై సబ్సిడీని గతేడాది మాదిరే రూ. 3,000 కోట్లకే పరిమితం చేశారు. విద్యుత్ సబ్సిడీని రూ. 5,700 కోట్ల నుంచి రూ. 7,500 కోట్లకు పెంచారు. విద్యుత్ సబ్సిడీపై గతేడాదితో పోలిస్తే ఖజానాపై రూ.1,800 కోట్ల అదనపు భారం పడింది.

**ప్రణాళికేతర వ్యయం పెరిగిందిలా (రూ. కోట్లలో)**

| బడ్జెట్ | 2013-14 | 2014-15 |
|---|---|---|
| జీతాలు | 34,997 | 42,622 |
| పెన్షన్లు | 14,209 | 16,517 |
| రుణాల చెల్లింపు | 8,627 | 8,115 |
| వడ్డీలు | 14,519 | 16,787 |
| నాన్ శాలరీ వ్యయం | 3,434 | 3,884 |
| ప్రభుత్వ నిర్వహణ | 1,796 | 17,796 |
| రుణాలు,అడ్వాన్సులు | 794 | 794 |
| రాయితీలు | 13,301 | 14,332 |
| ఇతర ఖర్చులు | 10,249 | 10,332 |
| మొత్తం | 1,01,926 | 1,15,179 |

## ఏ రంగానికి ఎంత కేటాయింపు..( రూ. కోట్లలో)

| శాఖ | 2013-14 బడ్జెట్ | 2014-15 బడ్జెట్ |
|---|---|---|
| వ్యవసాయం, అనుబంధ రంగాలు | 6,127.69 | 6,685.33 |
| గ్రామీణాభివృద్ధి | 10,374.38 | 13,661.77 |
| సాగునీరు | 23,023.62 | 23,311.98 |
| విద్యుత్ | 7,117.57 | 8,454.48 |
| పరిశ్రమలు | 1,119.72 | 1,046.83 |
| రవాణా | 5,310.31 | 6,042.01 |
| శాస్త్ర, సాంకేతిక, పర్యావరణం | 13.20 | 13.20 |
| సాధారణ ఆర్థిక సేవలు | 4,753.46 | 4,753.46 |
| క్రీడలు, యువసేవలు కళలు, సంస్కృతి | 425.96 | 440.07 |
| వైద్యం, ప్రజారోగ్యం | 6,481.01 | 6,850.60 |
| తాగునీటి సరఫరా, పారిశుధ్యం | 826.27 | 1,310.09 |
| సాధారణ విద్య | 19,842.65 | 22,123.09 |
| సాంకేతిక విద్య | 1,264 | 1,264 |
| గృహనిర్మాణం | 2,325.98 | 3,128.76 |
| పట్టణాభివృద్ధి | 6,770.96 | 7,140.69 |
| సమాచార, ప్రసార శాఖ | 206.83 | 206.83 |
| సంక్షేమం | 11,311.85 | 11,650.85 |
| కార్మిక, ఉపాధికల్పన | 562.55 | 586.02 |
| సామాజిక భద్రత, సంక్షేమం | 2,840.05 | 1,780.10 |
| సాధారణ సేవలు | 50,650.64 | 62,678.74 |
| మొత్తం | 1,61,348.70 | 1,83,128.90 |

# విద్యుత్ లాస్ రూ. 9 వేల కోట్లు...

వచ్చే ఏప్రిల్ 1 నుంచి విద్యుత్ చార్జీల భారం తప్పేలా లేదు. 2014-15లో మొత్తం రూ. 16,500 కోట్ల మేర బడ్జెట్ లోటు ఉంటుందని విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు పేర్కొన్నాయి. అంటే ఇందులో రూ. 7,500 కోట్ల మేర సబ్సిడీ కింద ఇవ్వనున్నట్టు తాజా ఓటన్ అకౌంట్ బడ్జెట్‌లో ప్రభుత్వం పేర్కొంది. అంటే మిగిలిన రూ. 9 వేల కోట్ల మేరకు ప్రజల నుంచే వసూలు చేయాలని ప్రభుత్వం తేల్చిచెప్పిందన్నమాట. ఈ మొత్తాన్ని విద్యుత్ చార్జీలను పెంచడం ద్వారానే డిస్కంలు భర్తీ చేసుకుంటాయి. 2013-14 బడ్జెట్‌లో విద్యుత్ సబ్సిడీకి రూ. 5,700 కోట్లు సర్కారు కేటాయించింది. దీనితో పోలిస్తే సబ్సిడీ మొత్తం రూ. 7,500 కోట్లకు పెరిగినప్పటికీ భారీ లోటు నేపథ్యంలో ప్రజలకు చార్జీల భారం తప్పేలా లేదు.

# మాటల వ్యవసాయం

కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ ప్రతి అంకెలోనూ.. మొక్కుబడి వైఖరి ప్రతిఫలించింది. వ్యవసాయ, అనుబంధ రంగాలకు బడ్జెట్ కేటాయింపు తగ్గింది. గత ఏడాది వార్షిక బడ్జెట్‌లో వ్యవసాయ అనుబంధ రంగాల వాటా 3.80 శాతం ఉండగా, ప్రస్తుతం (2014-15) బడ్జెట్‌లో ఇది 3.65 శాతానికి పడిపోయింది. ఏటా సగటున 10 శాతంగా ఉంటున్న ద్రవ్యోల్బణాన్ని పరిగణలోకి తీసుకుంటే ఈ తగ్గుదల కనీసం 15 శాతం ఉంటుందని ఆర్థికరంగ నిపుణులు చెబుతున్నారు.

➢ గత ఏడాది ధరల స్థిరీకరణ కోసం ప్రవేశపెట్టిన 'ఆలంబన' పథకానికి రూ. 100 కోట్లు ప్రకటించిన ప్రభుత్వం ఈసారి ఆ ఊసే ప్రస్తావించలేదు.

➢ వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు ఆర్థిక మంత్రి చెప్పినప్పటికీ, అంకెల్లో ఆ సంగతే లేదు.

➢ చాలా అంశాల్లో ప్రభుత్వం చెప్పినదానికి, కేటాయింపులకు పొంతన కనిపించలేదు.

➢ రైతులకు పంటరుణాలపై వడ్డీ చెల్లింపులకు సంబంధించిన కేటాయింపులు ఒక్క రూపాయి కూడా పెంచలేదు.

➢ గత బడ్జెట్‌లో వడ్డీ లేని రుణాల కోసం రూ. 500 కోట్లు, పావలా వడ్డీకి రూ. 60 కోట్లు కేటాయిస్తే.. ఈ సారి అవే అంకెలను యథాతథంగా ఉంచారు.

➢ బ్యాంకులు ఇస్తున్న 80 వేల కోట్ల పంటరుణాలకు జీరో వడ్డీ వర్తింపజేయాలంటే బడ్జెట్‌లో కనీసం 1600 కోట్లయినా కేటాయించాల్సి ఉందని వ్యవసాయాధికారులే చెబుతున్నారు.

➢ వ్యవసాయ అనుబంధ రంగాలకు వివిధ పథకాలకు గత ఏడాది బడ్జెట్ కేటాయింపులను యథాతథంగా ఉంచేశారు.

➢ జాతీయ పంటల బీమా పథకానికి ఇటీవల ప్రీమియం మొత్తాన్ని కేంద్రం 11 శాతానికి పెంచింది. దీనికి రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాలి. అయితే గత ఏడాది కేటాయించిన రూ. 410 కోట్లే యథాతథంగా ఉంచేశారు.

| 2014-15లో ఇలా.. (రూ. కోట్లలో) | |
|---|---|
| కేంద్ర పన్నుల్లో వాటా | 27,028.24 |
| రాష్ట్ర పన్నుల ఆదాయం | 84,780.64 |
| పన్నేతర ఆదాయం | 16,262.26 |
| గ్రాంట్స్ ఇన్ ఎయిడ్ | 21,078.15 |
| మూలధన ఆదాయం | 34,322.43 |
| మొత్తం ఆధాయం | 1,83,471.72 |
| **వ్యయం ఇలా..** | |
| ప్రణాళిక వ్యయం | 67,949.62 |
| ప్రణాళికేతర వ్యయం | 1,15,179.27 |
| మొత్తం వ్యయం | 1,83,128.89 |
| రెవెన్యూ మిగులు | 473.96 |
| ద్రవ్యలోటు | 25,401.96 |
| **2013-14లో ఇలా..** | |
| మొత్తం ఆధాయం | 1,61,731.83 |
| ప్రణాళిక వ్యయం | 59,422 |
| ప్రణాళికేతర వ్యయం | 1,01,926 |
| మొత్తం వ్యయం | 1,61,348 |
| రెవెన్యూ మిగులు | 1,023 |
| ద్రవ్యలోటు | 24,487 |

## 2014-15 బడ్జెట్‌కు సంబంధించి ముఖ్యమైన ప్రాజెక్టులకు కేటాయించిన నిధుల వివరాలు...

| ప్రాజెక్టు పేరు | బడ్జెట్ కేటాయింపు (రూ.కోట్లల్లో) | ప్రాజెక్టు పేరు | బడ్జెట్ కేటాయింపు (రూ.కోట్లల్లో) | ప్రాజెక్టు పేరు | బడ్జెట్ కేటాయింపు (రూ.కోట్లల్లో) | ప్రాజెక్టు పేరు | బడ్జెట్ కేటాయింపు (రూ.కోట్లల్లో) |
|---|---|---|---|---|---|---|---|
| సాగర్ ఆధునీకరణ | 743 | ఆర్‌డీఎస్ లింక్ కెనాల్ | 13 | చాగల్నాడు | 7 | కొరిసపాడు లిఫ్టు | 17 |
| కాడా | 153 | కేసీ కెనాల్ ఆధునీకరణ | 70 | తారకరామ | 7 | తారకరామతీర్థ | 40 |
| పోలవరం బ్యారేజ్ | 457.50 | సోమశిల | 400 | నెట్టెంపాడు | 88 | పెద్దవాగు | 20 |
| పులిచింతల | 208.94 | గోదావరి డెల్టా ఆధునీకరణ | 180 | కల్వకుర్తి | 122 | నిల్వాయి | 35 |
| ఎస్సారెస్పీ-2 | 40 | పెన్నార్ రివర్ కెనాల్ | 150 | తోటపల్లి | 120 | జంఝావతి | 4 |
| ఫ్లడ్‌ఫ్లో కెనాల్ | 475 | ఏలేరు రిజర్వాయర్ | 30 | గురురాఘవేంద్ర లిఫ్టు | 78.51 | మద్దువలస | 15 |
| గుండ్లకమ్మ | 15 | సింగూరు | 40 | గుండ్లకమ్మ | 14 | పాలెంవాగు | 25 |
| పుష్కరం | 45 | ఎస్ఆర్‌బీసీ | 70 | వెంకటనగరం | 25 | సుద్దవాగు | 10 |
| తాడిపూడి | 60 | జూరాల | 49 | ఎల్లంపల్లి | 450 | భూపతిపాలెం | 10 |
| రాజీవ్‌భీమా | 125 | తెలుగుగంగ | 154 | రాజీవ్ దుమ్ముగూడెం | 82 | సంగంబండ | 20 |
| దేవాదుల | 462 | ఎస్ఎల్‌బీసీ | 420 | దుమ్ముగూడెం-సాగర్‌టెయిల్‌పాండ్ | 97 | మునురుమిల్లి | 16 |
| ప్రాణహిత-చేవెళ్ల | 1051 | నెరేడి బ్యారేజ్ | 45 | లెండి | 45 | మహేంద్రతనయ | 15 |
| ఇందిరా దుమ్ముగూడెం | 75.10 | గాలేరు-నగరి | 321.50 | ఆలీసాగర్ | 4 | తుంగభద్ర ఎల్ఎల్‌సీ ఆధునీకరణ | 35 |
| ఎస్సారెస్పీ | 160 | పులివెందుల బ్రాంచ్ కెనాల్ | 82 | గుత్పా | 8 | తుంగభద్ర హెచ్ఎల్‌సీ-1,-2 | 79.75 |
| కడెం | 22 | కృష్ణా డెల్టా ఆధునీకరణ | 332.51 | చౌటుపల్లిహన్మంతరెడ్డి లిఫ్టు | 10 | మైలవరం | 10 |
| వంశధార | 13 | హంద్రీ-నీవా | 416 | చింతలపూడి | 70 | మైనర్ ఇరిగేషన్ | 2354.24 |
| నిజాంసాగర్ ఆధునీకరణ | 180 | వెలిగొండ | 402 | కంతనపల్లి | 80 | | |

## సాగునీటి ప్రాజెక్టులకు గతం మాదిరే కేటాయింపులు

సాగునీటి ప్రాజెక్టులకు గత ఏడాది కేటాయించిన స్థాయిలోనే ప్రస్తుత బడ్జెట్‌లో కూడా నిధులను కేటాయించారు. ఆయా ప్రాజెక్టులకు 2013-14లో కేటాయించిన నిధులకు సమానంగా తాజా బడ్జెట్‌లో కూడా చూపించారు. ఈ విషయంలో ప్రాజెక్టు నిర్మాణ దశలను పట్టించుకోలేదు. ఏ ప్రాజెక్టుకు ఎంత మేర నిధులు అవసరమనే విషయాన్ని అంచనా వేయలేదు. అలాగే కేంద్రం నుంచి వచ్చే నిధులను కూడా పోయిన ఏడాది మాదిరిగానే అంచనా వేసి బడ్జెట్‌లో పొందుపరిచారు. కాగా, నిర్మాణ పనుల్ని పక్కన పెట్టిన దుమ్ముగూడెం-సాగర్ టెయిల్‌పాండ్ ప్రాజెక్టుకు రూ. 97 కోట్లను కేటాయించడం విశేషం. అలాగే కేంద్రం నుంచి ఏఐబీపీ కింద రూ. 1394.27 కోట్లు రానున్నాయని అంచనా వేశారు. కొన్ని ముఖ్యమైన ప్రాజెక్టులకు ఎక్కువ నిధులను కేటాయించారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుకు రూ. 1,051 కోట్లను కేటాయించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం కేంద్రం నుంచి రూ. 87.50 కోట్లు వస్తాయని, రాష్ట్రం నుంచి రూ. 370.50 కోట్లను వ్యయం చేయాలని నిర్ణయించారు. పునరావస పనుల కోసం రూ. 185 కోట్లను కేటాయించారు.

# రాష్ట్ర సామాజిక ఆర్థిక సర్వేలో కొన్ని ముఖ్యాంశాలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గడచిన కొన్నేళ్లుగా ప్రగతి పథాన పయనిస్తోంది. వృద్ధిరేటు పెరుగుతోందని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. సరైన విధానాలు, పథకాలు, కార్యక్రమాల రూపకల్పన.. వాటిని సమర్థంగా అమలు చేయడం వల్లే ఇది సాధ్యమవుతోందని తెలిపింది. 'రాష్ట్ర సామాజిక ఆర్థిక సర్వే నివేదిక'ను ఆర్థికశాఖ విడుదల చేసింది. 2012-13 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ).. ముందు ఏడాదికన్నా 13.91 శాతం ఎక్కువ నమోదైందని (ప్రస్తుత ధరల ప్రకారం), స్థిర ధరల ప్రకారం 5.78 శాతం ఎక్కువ నమోదైందని ఈ నివేదిక తెలియజేసింది. ఆశాజనకంగా ఉన్న వర్షపాతం, పంటల సాగు కారణంగా ఈ ఏడాది జీఎస్‌డీపీ ఇంకా వృద్ధి చెందే అవకాశం ఉందని విశ్లేషించింది. అయితే, సామాన్య ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే విధంగా సమ్మిళిత అభివృద్ధి లక్ష్యంగా ఉపాధి, ఆదాయ వనరులను అందరికీ అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. ఈ నివేదికలోని ముఖ్యాంశాలు...

- వార్షిక వృద్ధి రేటు పెరుగుదలతో రాష్ట్ర ఆర్థికాభివృద్ధి పెరుగుతోంది. 9వ పంచవర్ష ప్రణాళికలో వృద్ధిరేటు 5.59 ఉండగా పదో ప్రణాళికకు ఇది 8.19కి పెరిగింది. 11వ ప్రణాళికలో ఇది 8.37కు చేరింది.
- 12వ పంచవర్ష ప్రణాళిక లక్ష్యమైన 10 శాతం వృద్ధిరేటును చేరుకోవటం సాధ్యమే. వ్యవసాయరంగంలో 6 శాతం, పారిశ్రామిక రంగంలో 10.5 శాతం, సేవారంగంలో 11.5 శాతం వృద్ధిరేటు లక్ష్యాలను చేరుకోగలం.
- యువతలో నైపుణ్యాలను పెంచి నిరుద్యోగాన్ని వేగంగా తగ్గించడం, అవకాశాలను అందిపుచ్చుకునే అంతరాలను తగ్గించడం అత్యవసరం.
- కీలక రంగాలైన వ్యవసాయం, పశు గణాభివృద్ధి, మత్స్య పరిశ్రమ, ఉద్యానశాఖ, పారిశ్రామిక, ఐటీ, పర్యాటక, యువజన సంక్షేమం, మైనార్టీ సంక్షేమ రంగాల్లో ప్రణాళికబద్ధమైన అభివృద్ధి ఆవశ్యకతను ప్రభుత్వం గుర్తించింది.
- 12వ ప్రణాళికలో రాష్ట్ర ప్రణాళిక వ్యయం రూ. 3,42,842 కోట్లు. 12వ ప్రణాళిక మొత్తం వ్యయంలో ఇది 9.2 శాతం.
- ప్రస్తుత ధరలను ప్రాతిపదికగా తీసుకుంటే రాష్ట్ర స్థూల ఉత్పత్తి రూ. 7,48,968 కోట్లుకాగా స్థిర ధరల్లో ఇది రూ. 4,31,996 కోట్లుగా అంచనా.
- రాష్ట్రంలో తొమ్మిదేళ్లుగా తలసరి ఆదాయం బాగా పెరుగుతోంది. జాతీయ సగటు కంటే రాష్ట్రంలో సగటు తలసరి ఆదాయం ఎక్కువ. 2004-05లో రాష్ట్రంలో తలసరి ఆదాయం రూ. 25,321. 2011-12లో రూ. 69,350 ఉండగా, 2012-13 నాటికి 13.29% పెరిగి రూ. 78,564కు చేరింది.
- రాష్ట్ర స్థూల ఉత్పత్తి సేవారంగం వాటా 57.32 శాతం. సేవారంగం వృద్ధిరేటు 7.75. రవాణా, సమాచార, బ్యాంకింగ్, బీమా ఉప రంగాల్లో వృద్ధిరేటు రెండంకెలకు చేరింది.
- రాష్ట్ర స్థూల ఉత్పత్తి జాతీయ సగటు కంటే ఎక్కువగా నమోదవుతోంది. వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల్లో ప్రగతి జాతీయ సగటు కంటే అధికంగానే ఉంది.
- రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో పారిశ్రామిక రంగం వాటా 23.63 శాతం. పారిశ్రామిక రంగంలో వృద్ధిరేటు 0.08 శాతం. ఈ రంగంలో పెరుగుదల ఒక మోస్తరుగానే ఉంది. రిజిష్టర్డ్, రిజిష్టర్డ్‌యేతర తయారీ రంగంలో వృద్ధిరేటు తగ్గి తిరోగమనంలో ఉంది. మైనింగ్, విద్యుత్, నిర్మాణ రంగాల్లో పెరుగుదల ఆశాజనకం.
- రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో వ్యవసాయ రంగం వాటా 19.05 శాతం. 2010-11 మినహా ఇటీవల కాలంలో ఈ రంగం మెరుగైన స్థితిలో ఉంది. 2012-13లో వ్యవసాయ రంగం వృద్ధిరేటు 7.48 శాతంగా నమోదైంది. వ్యవసాయ అనుబంధరంగాల్లో వృద్ధిరేటు కొనసాగుతోంది. ◆

# కొండను తవ్వి ఎలకను పట్టినట్టు పునర్విభజన బిల్లు: జేపీ

గొప్ప కసరత్తుతో చేసిన సవరణలతో రూపొందించామని చెప్పుకుంటూ కేంద్ర కేబినెట్ ఫిబ్రవరి 7వ తేదీ రాత్రి ఆమోదించిన ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లు కొండను తవ్వి ఎలకను పట్టిన చందంగా ఉందని లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. లోక్‌సత్తా ప్రతిపాదించిన 7 కీలక సవరణల్లో కేవలం రెండింటిని మాత్రమే బిల్లులో చేర్చారని, మౌలికమైన ఆర్థిక సవరణల్లో ఒక్కటంటే ఒక్కటిని కూడా ఆమోదించకుండా మొండి చెయ్యి చూపారని అన్నారు. లోక్‌సత్తా చెప్పినవి నిర్మాణాత్మకంగా ఉన్నందున వాటన్నిటినీ చేస్తున్నట్టు కబుర్లు చెబుతూ తమ మీద అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. కేంద్ర కేబినెట్ ఆమోదించిన పునర్వ్యవస్థీకరణ బిల్లు తెలుగు ప్రజల భవిష్యత్తును ఏమాత్రం కాపాడలేదని, ఇంత అధ్వాన్నంగా బిల్లును తయారుచేయబట్టే, ఈ అంశంపై దేశప్రజలంతా ఉత్కంఠగా ఎదురుచూస్తున్నా, కనీసం బిల్లులో ఏ అంశాన్ని ఎందుకు చేర్చారో చెబుతూ వివరణ ఇచ్చే సాహసాన్ని కూడా కేంద్రప్రభుత్వం చేయలేకపోయిందని అన్నారు.

**కేంద్ర కేబినెట్ ఆమోదించిన ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లులోని డొల్లతనం, అందులో నిర్దిష్టంగా చేర్చాల్సిన సవరణలపై జయప్రకాష్ నారాయణ్ లోక్‌సత్తా పార్టీ ప్రధాన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు.**

**జేపీ మాట్లాడుతూ...** రాష్ట్ర విభజన జరిగే పరిస్థితులలో ఆర్థికంగా మూడు ప్రాంతాల ప్రయోజనాలనూ పరిరక్షించేలా, దీర్ఘకాలిక భవిష్యత్తుకు భరోసా ఇచ్చేలా ఎంతో లోతుగా ఆలోచించి లోక్‌సత్తా పార్టీ చేసిన నిర్దిష్ట ప్రతిపాదనల ఆధారంగా, బీజేపీ, ఆంధ్రప్రదేశ్ పార్లమెంటు సభ్యులు కూడా నిర్మాణాత్మకమైన, సవివరమైన సవరణల్ని ప్రతిపాదించారని, వాటిని కూడా బుట్టదాఖలు చేశారని అన్నారు. అందరి ప్రయోజనాలనూ సమన్వయం చేస్తూ సామరస్య పరిష్కారం సాధించే ప్రయత్నమే కేంద్రం చేయలేదన్నారు. కేబినెట్‌కు వెళ్లే ముందు మాత్రం మమ్మల్ని నమ్మండి, మీరు చెప్పినవన్నీ చేస్తామని చెప్పి చివరకు తిమ్మినిబమ్మిని చేసే ప్రయత్నం చేశారన్నారు. 294 పేజీలు మన ముఖాన కొట్టారన్నారు. అన్ని పేజీల్లో అనెక్సర్ 'డి'లోని 4,5 పేజీలు తప్ప కొత్తగా చెప్పిందేమీ లేదన్నారు. పాత బిల్లు, శాసన మండలి, సభ అభిప్రాయాలు, నియోజకవర్గాలలో మండలాల జాబితాలు వంటి వివరాలతో పేజీలు నింపారన్నారు. విభజన జరిగితే మొదటి రోజు నుంచి కూడా తలెత్తే సమస్యల్ని, ముఖ్యంగా ఆర్థిక సమస్యల్ని లోక్‌సత్తా నిర్దిష్టంగా శాసనసభలో వివరించిందని, అంతటితో ఊరుకోకుండా రాష్ట్రపతికి 7 పరిష్కారాంశాలతో వివరంగా లేఖ రాసిందని, వెంటనే అర్థం చేసుకోవటానికి వీలుగా పట్టికలతో సహా – సమస్య ఏమిటి, ఏం చేయాలి, ఎలా చేయాలి, దానికి ఎలాంటి నిర్దిష్టమైన సవరణలు చేయాలి వివరిస్తూ లిఖితపూర్వకంగా కేంద్రానికి సవరణలు ఇచ్చిందని, నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఎటువంటి గందరగోళం లేకుండా కేంద్రం వెంటనే సామరస్య పరిష్కారాన్ని సాధించగలిగేదని అన్నారు.

ప్రధానంగా రూ.13,000 కోట్ల మిగులు ఉన్న హైదరాబాద్ అండ వల్లే తెలంగాణకు లోటు పూడి మిగులు లభిస్తుందని, ఆ మహానగరం అండ లేకపోవటం వల్లే రాయలసీమ, ఉత్తరాంధ్ర వంటి వెనకబడిన ప్రాంతాలున్న మిగిలిన ఆంధ్రప్రదేశ్ తీవ్ర ఆర్థిక ఒడిదుడుకులకు లోనవుతుందని లోక్‌సత్తా విస్పష్టంగా అంకెలు బైటపెట్టిందని జేపీ అన్నారు. 2012–13 లెక్కల ప్రకారం, ఈ లోటు ఈ ఏడాది రూ.10,000 కోట్లు పైచిలుకే ఉంటుందన్నారు. ఈ ఆదాయ లోటును పూడ్చటానికి కనీస ఏర్పాటు కూడా కేబినెట్ ఆమోదించిన బిల్లులో లేదన్నారు. రాష్ట్రాన్ని విభజించిన కేంద్ర ప్రభుత్వం, దాని వల్ల నష్టపోయే ప్రాంతాలకు రెవిన్యూ లోటును భర్తీ చేయాల్సిన బాధ్యత కూడా తీసుకోవాల్సిందేనన్నారు. అత్యంత వెనకబడిన రాయలసీమకు ప్రత్యేక ప్రతిపత్తి ప్రాంతం హోదా కల్పించి స్పెషల్ స్టేటస్ రాష్ట్రాలతో సమానంగా అన్ని పన్ను రాయితీలు, మినహాయింపులు ఇవ్వాలని లోక్‌సత్తా కోరితే, రాయలసీమ ఒక ప్రాంతం కాబట్టి అటువంటి ఏర్పాటు లేదని బిల్లులో కుంటిసాకు చెప్పారన్నారు. రాష్ట్ర విభజన తర్వాత రాష్ట్రానికి ప్రత్యేక ప్యాకేజీ గ్రాంట్లు ఇవ్వొచ్చు అని మాత్రం

పేర్కొన్నారని, అంటే, రూ.10,000 కోట్ల లోటుకు రూ.1 కోటి ఇచ్చినా సరిపుచ్చుకోవాలన్నట్టు చెప్పారన్నారు. రెండోది, పారిశ్రామికీకరణను కేవలం హైదరాబాద్ చుట్టుపక్కలే కేంద్రీకృతం చేసి తెలుగు ప్రజలు గతంలో చేసిన తప్పు ఇప్పుడు శాపంగా మారిందని, దీన్ని సరిచేయటానికి ఇతర ప్రాంతాలలో పారిశ్రామికీకరణకు 100 శాతం సెంట్రల్ ఎక్సయిజ్, కార్పొరేట్ ఆదాయపు పన్ను, క్యాపిటల్, రవాణా సబ్సిడీ వంటి మినహాయింపులు ఇవ్వాలని లోక్‌సత్తా నిర్దిష్టంగా ప్రతిపాదించిందని, మనకంటే ఎక్కువ తలసరి ఆదాయం ఉన్న హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాంచల్ వంటి రాష్ట్రాల్ని చూపి ఇమ్మని కోరిందని, ఇంత హేతుబద్ధంగా, సాక్ష్యాలతో కోరినా పట్టించుకోలేదన్నారు.

కేవలం పోలవరం ముంపు ప్రాంతాలను మిగిలిన ఆంధ్రప్రదేశ్‌లో చేర్చాలి, తెలంగాణ, రాయలసీమలో కృష్ణా మిగులు జలాలతో నిర్మిస్తున్న ప్రాజెక్టులకు భవిష్యత్తులో ఆటంకాలు రాకుండా నికర జలాలు అందే ఏర్పాటు చేయాలి అని లోక్‌సత్తా చెప్పిన 2 సవరణల్ని మాత్రమే బిల్లులో పొందుపరిచారని జేపీ అన్నారు. అలాగే ఎన్.టి.పి.సి ద్వారా తెలంగాణలో 4,000 మెగావాట్ల విద్యుత్‌కు ఏర్పాటు, తెలంగాణలో వెనకబడ్డ ప్రాంతాల అభివృద్ధికి రోడ్ల నిర్మాణాన్ని నిర్దిష్ట కాలపరిమితిలో చేపట్టాలి అని లోక్‌సత్తా అడిగిన రెండు హామీల్ని మాత్రం బిల్లులో పొందుపరిచారన్నారు. వీటినే గొప్పగా చేసినట్టు చూపుతున్నారన్నారు. ప్రకాశం, గుంటూరు, కృష్ణా జిల్లాల అభివృద్ధికి దోహదం చేసేలా లోక్‌సత్తా అడిగిన రామాయపట్నం మేజర్ పోర్టు ఏర్పాటు ఊసే లేదన్నారు. ఖమ్మం, కడపలో ఉక్కు కర్మాగారాల ఏర్పాటు, విశాఖ- చెన్నై పారిశ్రామిక కారిడార్, విశాఖ, విజయవాడ, గుంటూరు, తెనాలి మెట్రో రైలు, గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీ ఏర్పాటు వంటి మిగిలిన అంశాలన్నిటిలో లోక్‌సత్తా ప్రతిపాదనలపై వేగంగా, త్వరగా చూస్తాం అనటమే తప్ప, తప్పకచేస్తామన్న మాటే లేదన్నారు. వేటికీ కూడా భారత ప్రభుత్వ నిధి (కన్సాలిడేటెడ్ ఫండ్) నుంచి కేటాయింపు లేదన్నారు. హైదరాబాద్ నగరంలో అన్ని భాషల, అన్ని ప్రాంతాలవారికి మానసికంగా భరోసా ఇచ్చేలా చట్టబద్ధ ఏర్పాట్లకు రాజ్యాంగ సవరణ చేయాలన్న లోక్‌సత్తా సవరణను పట్టించుకోలేదన్నారు. రాజ్యాంగ సవరణ చేయకుండా గవర్నర్ చేతిలో శాంతిభద్రతలు సాధ్యం కాకపోవచ్చన్నారు.

**ఈ ఐదు కీలక చేర్పుల కోసం ఆంధ్రప్రదేశ్ ఎంపీలు, భాజపా బాధ్యత తీసుకోవాలి**

ఇక ఈ యూపీయే ప్రభుత్వాన్ని అడిగి ప్రయోజనం లేదని, ఆంధ్రప్రదేశ్ పార్లమెంటు సభ్యులు, జాతీయ స్థాయిలో ప్రధాన ప్రతిపక్షం బీజేపీ గట్టిగా బాధ్యత తీసుకుని ఈ ఐదు సవరణల కోసం పార్లమెంటులో పట్టుబట్టి, కేంద్రప్రభుత్వం మెడలు వంచి సాధించాలని జేపీ విజ్ఞప్తి చేశారు...

1. ఎట్టి పరిస్థితులలోనూ రాష్ట్ర విభజన జరిగినట్టయితే, దాని పర్యవసానంగా ఆర్థికంగా నష్టపోయే ప్రాంతాలకు ప్రతి ఏడాదీ ఆదాయ లోటు భర్తీ చేసే ఏర్పాట్లను బిల్లులో పెట్టి చట్టబద్ధంగా, విశ్వసనీయ ఏర్పాట్లు చేయాలి. 2014 ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లోనే కేటాయింపులు చూపాలి. భారత ప్రభుత్వ నిధి నుంచి చెల్లించాలి.
2. రాయలసీమ జిల్లాలు, ఉత్తరాంధ్ర జిల్లాల పారిశ్రామికాభివృద్ధికి ప్రత్యేక ప్రతిపత్తి రాష్ట్రాలకు ఇస్తున్న రీతిలోనే పన్నుల రాయితీలు, మినహాయింపులు ఇవ్వాలి. ఇందుకోసం ఏర్పాట్లను ప్రధానమంత్రి అధ్యక్షతన ప్రణాళికా సంఘం సమావేశం ఏర్పాటు చేసి ఖరారు చేయాలి, బిల్లులో చేర్చాలి.
3. రాయలసీమ ప్రాంతానికి ప్రత్యేక ప్రాంత ప్రతిపత్తిని కల్పించటం చేతగాకపోతే, ఎలాగైతే భద్రాచలం పట్టణాన్ని ఆ ప్రాంత ప్రజల తీర్మానం వల్ల తెలంగాణలో చేర్చారో, అలాగే అనంతపురం, కర్నూలులోని అన్ని పంచాయతీల ప్రజలూ ఏకగ్రీవంగా తీర్మానించినట్టు ఆ రెండు జిల్లాలనూ తెలంగాణలో కలపాలి. ఇలా తెలంగాణలో అనంతపురం, కర్నూలు జిల్లాలని కలపటం వల్ల ప్రజల కోర్కె నెరవేరుతుంది, వెనకబడ్డ ప్రాంతాలకి ఆర్థిక భద్రత ఉంటుంది, కృష్ణా జలాల వినియోగంలోని సమస్యలని సామరస్యంగా సాధించే వీలుంటుంది.
4. పోర్టులు, స్టీల్‌ప్లాంట్లు, పారిశ్రామిక కారిడార్లు వంటి పైన పేర్కొన్న అన్ని మౌలిక వసతుల ఏర్పాటునూ నిర్దిష్టంగా ప్రకటించి, కేంద్రం వ్యయంతో చేపట్టేలా చట్టంలో చేర్చాలి.
5. హైదరాబాద్ నగరం విషయంలో ప్రజల మానసిక భరోసా కోసం లోక్‌సత్తా ప్రతిపాదించినట్టు రాజ్యాంగ సవరణ చేయాలి. ఈలోగా అవసరమనుకుంటే గవర్నర్ ప్రతిపాదించిన ప్రత్యేక చట్టం తేవాలి.

ఈ ఐదు కీలక అంశాలనూ తెలుగు ప్రజల భవిష్యత్తుకి భరోసా ఇచ్చేలా మార్పులు తెచ్చిన తర్వాతే రాష్ట్ర విభజన బిల్లు ముందుకు వెళ్లాలని జేపీ స్పష్టం చేశారు. అలా కాక బలవంతంగా బిల్లుని ముందుకు తీసుకువెళ్తే, అది తెలుగు ప్రజల భవిష్యత్తుకి ప్రమాదమవుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ, కేంద్ర ప్రభుత్వం తెలుగు ప్రజలకిచ్చిన వాగ్దానాలు నెరవేర్చాలే తప్ప తప్పించుకోవటం ప్రజాద్రోహమవుతుందని స్పష్టం చేశారు.

ఎంపీలు, బీజేపీ అగ్రనేతలతో తాను సంప్రదింపుల్లో ఉన్నానని, లోక్‌సత్తా ప్రతిపాదించిన సవరణల్ని బిల్లులో చేర్చేలా వారు పోరాటం చేస్తారని ఆశిస్తున్నామని జేపీ తెలిపారు.

వారసత్వ, కుటుంబ, ధన రాజకీయాలతో, ఆర్థికంగా వినాశకర విధానాలతో వ్యవహరిస్తూ రాష్ట్రంలో సంక్షోభానికి కారకులైనందున తెలుగుదేశం, ఇతర సాంప్రదాయ పార్టీలతో లోక్‌సత్తా ఎన్నికల పొత్తు పెట్టుకోదని ఓ ప్రశ్నకు సమాధానంగా జేపీ తేల్చిచెప్పారు. చిన్న పిల్లల రాజకీయం చేస్తున్న ఆమ్ ఆద్మీ పార్టీతో కూడా తమకు పొసగదని మరో ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. రాజుగారి ఒంటి మీద బట్టలు లేవు అని చెప్పాడు గదా అని చిన్న పిల్లాడికే పట్టం గడితే పాలన నడవదని, ఆమ్ ఆద్మీ పార్టీ తన తీరు మార్చుకోకపోతే ప్రజలకు పెద్ద మేలు చేయలేదని అన్నారు. మల్కాజిగిరి పార్లమెంటు స్థానం నుంచి పోటీ చేస్తారా అని అడగగా, ముందు తెలుగు ప్రజల సంక్షోభానికి పరిష్కారంపై దృష్టి కేంద్రీకరించాలని, తర్వాత పోటీ గురించి మాట్లాడదామని జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

ఈ సమావేశంలో లోక్‌సత్తా పార్టీ నేతలు ఎం. సత్యనారాయణ, ఐ. అనంతలక్ష్మి, పి. శివాజీ పాల్గొన్నారు. ◆

# ప్లెడ్జి రుణాల కుంభకోణం దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలి: లోక్‌సత్తా

పంట నిల్వ చేసుకుని మంచి ధర లభించినప్పుడు అమ్ముకోవటానికి, ఈలోగా అవసరమైతే ప్లెడ్జి లోన్లు (తనఖా రుణాలు) తీసుకోవటానికి అవసరమైన శీతల గిడ్డంగుల ఏర్పాటులో తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వం, ఉన్న కాసిని గిడ్డంగులలో కూడా రైతుల ప్రయోజనాలను కాపాడలేక పోతోందని లోక్‌సత్తా పార్టీ ధ్వజమెత్తింది.

శీతల గిడ్డంగుల యజమానులు, బ్యాంకు అధికారులు కుమ్మక్కయి గిడ్డంగులలో పంట నిల్వ చేసుకున్న రైతుల పేరుతో కొన్నేళ్లుగా భారీ రుణాలను మింగేస్తున్నా ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవటం వల్ల ఇప్పుడు ఆ దోపిడీ కోట్ల రూపాయలకు చేరిందని పార్టీ రైతు విభాగం రాష్ట్ర కన్వీనర్ పి. భాస్కరరావు అన్నారు. గతంలో ఖమ్మం జిల్లా మధిరలో ఇదే తరహాలో రైతులను మోసం చేసిన దళారులు, బ్యాంకు అధికారులపై చర్యలు తీసుకోవాలని లోక్‌సత్తా కోరినా సర్కారు స్పందించలేదని గుర్తుచేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే తాజాగా ప్రకాశం జిల్లాలో రూ. 100 కోట్ల కుంభకోణం జరిగిందన్నారు.

ప్రకాశం జిల్లాలో రైతుల పాస్ పుస్తకాలను అడ్డం పెట్టుకుని అక్రమంగా బ్యాంకు రుణాలు బొక్కిన శీతల గిడ్డంగుల యాజమానులపై, అందుకు కారణమైన అధికారులపై, తక్షణం చర్యలు తీసుకోవాలని, ఆ డబ్బును కక్కించాలని భాస్కరరావు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వమే లేని పరిస్థితి నెలకొన్నందున ఉన్నతాధికారులు తక్షణం స్పందించాలని, ఈ కుంభకోణంలో అక్రమంగా అరెస్టు చేసిన రైతులను వెంటనే విడుదల చేయాలని అన్నారు. ఇలాంటి దోపిడీలు పునరావృతం కాకుండా వ్యవసాయ మార్కెటింగ్ విభాగాల్ని సమూలంగా ప్రక్షాళన చేయాలన్నారు.

"మార్కెట్ కమిటీలలో రాజకీయ జోక్యం లేకుండా పూర్తిగా రైతులకే అవకాశం కల్పించాలి. గిడ్డంగుల సంఖ్యను పెంచటంతోపాటు వాటిని మార్కెట్ కమిటీల పర్యవేక్షణలోకి తెచ్చి ప్లెడ్జి రుణాల జారీలో ఎటువంటి అక్రమాలు లేకుండా చూడాలి" అని భాస్కరరావు డిమాండ్ చేశారు. ◆

# వారసత్వపు రాజకీయాల్ని తిరస్కరించండి : జేపీ

## లోక్‌సత్తాలో భారీగా చేరిన యువత

కుటుంబ వారసత్వంగా వచ్చే రాజకీయాన్ని ప్రజలు నిర్ద్వంద్వంగా తిరస్కరించాలని లోక్‌సత్తా పార్టీ జాతీయాధ్యక్షులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. రాజకీయం ... విద్య, ఉపాధి, ఆరోగ్యం, మౌలిక సదుపాయాల చుట్టూనే తిరగాలి తప్ప, కుటుంబాల పేరుతో, వారి సంపదలు పెంచడం చుట్టూ కాదని పేర్కొన్నారు.

యువసత్తా ఆధ్వర్యంలో మల్కాజ్‌గిరి పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి వచ్చిన 150 మంది యువతీ యువకులు లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. అలాగే, సోషల్ మీడియా ద్వారా వచ్చిన మరో 50 మంది కూడా పార్టీలో చేరారు. వారందరికీ కండువాలు కప్పి, పార్టీలోకి ఆహ్వానించిన అనంతరం జేపీ మాట్లాడుతూ... సరికొత్త రాజకీయ నిర్మాణాన్ని యువత తమ బాధ్యతగా తీసుకోవాలన్నారు. యువత తెలివితేటలు, సామర్థ్యాలు పెంచి ప్రపంచంలో ఎక్కడైనా ఎదగగల శక్తిని పెంపొందించడమే రాజకీయం పరమార్థం కావాలన్నారు. కోట్లాదిమంది ప్రజల ఆశలు నెరవేర్చే నిజమైన రాజకీయం కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని, అలాంటి రాజకీయాన్ని అందించే శక్తి ఒక్క లోక్‌సత్తాకు మాత్రమే వుందన్నారు. "ఈ దేశానికి నువ్వు పనికొస్తావా, లేదా? ఈదేశాన్ని మార్చుకోవడానికి నువ్వు పనికొస్తావా, లేదా? అని చూడాలి మాత్రమే తప్ప, ఏ కులంలో, మతంలో, కుటుంబంలో పుట్టావనేదాని చుట్టూ రాజకీయం తిరగరాదన్నారు.

చైనా పాతికేళ్ళలో 20 కోట్ల ఉద్యోగాలు సృష్టిస్తే, భారత్‌లో పాతికేళ్ళలో కేవలం 20 లక్షల ఉద్యోగాలను మాత్రమే సృష్టించగలిగామని జేపీ గుర్తుచేశారు. ఈరోజుకీ మన దేశంలో కేవలం 11 శాతం మందే పరిశ్రమల్లో వున్నారని, 60 శాతం మంది ఇంకా అసంఘటిత రంగంలోనే బతుకులీడుస్తున్నారని, వీరందరికీ జీవితంలో తలెత్తుకు తిరిగే శక్తిని అందించే రాజకీయం కోసమే లోక్‌సత్తా అలుపెరుగని పోరాటం చేస్తోందన్నారు.

ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం బోదులబండ పంచాయతీ మాజీ సర్పంచ్ సి.హెచ్. పూర్ణచంద్రరావు కూడా జేపీ చేతులమీదుగా పార్టీ సభ్యత్వం తీసుకున్నారు.

ఈ సమావేశంలో లోక్‌సత్తా పార్టీ జీహెచ్ఎంసీ విభాగం అధ్యక్షుడు దోసపాటి రాము, ఉపాధ్యక్షురాలు పేరిచర్ల భవాని, యువసత్తా రాష్ట్ర అధ్యక్షుడు పి. శివాజీరాజు, పార్టీ ఎల్.బి.నగర్ అధ్యక్షుడు జన్నేపల్లి శ్రీనివాసరెడ్డి, వాలంటీరింగ్ విభాగం నుంచి ఓరుగంటి చంద్రశేఖర్, రజని కరుటూరి, శ్రవణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ◆



# అసెంబ్లీ అభ్యర్థుల ఎంపికకు జిల్లాలవారీగా లోక్‌సత్తా పార్టీ స్క్రీనింగ్ కమిటీలు

రాష్ట్రంలో 2014 అసెంబ్లీ ఎన్నికలకు ఇప్పటికే 25 మంది అభ్యర్థులతో తొలి జాబితాను విడుదల చేసిన లోక్‌సత్తా పార్టీ మిగతా నియోజకవర్గాలలో అభ్యర్థుల ఎంపికకు జిల్లాలవారీగా స్క్రీనింగ్ కమిటీలను ఏర్పాటు చేసింది. పార్టీపరంగా పోటీకి దరఖాస్తు చేసుకున్న నేతలు, వ్యవస్థలో మార్పు కోసం ముందుకొచ్చే ప్రభావశీల వ్యక్తులు, SYC (సజెస్ట్ యువర్ క్యాండిడేట్) విధానం ద్వారా ప్రజలు సూచించిన అభ్యర్థులను పరిశీలించి స్థానిక పార్టీ నేతలతో చర్చించి ఈ స్క్రీనింగ్ కమిటీలు అభ్యర్థులను ఖరారు చేస్తాయని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. రవిమారుత్ తెలిపారు.

**లోక్‌సత్తా పార్టీ అభ్యర్థుల ఎంపికకు జిల్లాలవారీగా ఏర్పాటైన స్క్రీనింగ్ కమిటీల సభ్యుల పేర్లను రవి మారుత్ విడుదల చేశారు. వివరాలు...**

| జిల్లా | స్క్రీనింగ్ కమిటీ సభ్యులు |
|---|---|
| శ్రీకాకుళం, విజయనగరం | – భీశెట్టి అప్పారావు బాబ్జీ<br>డా॥ విష్ణుమూర్తి,<br>కొత్తకోట పోలినాయుడు<br>సాయి పార్థసారథి |
| విశాఖపట్నం, ఖమ్మం | – పి. రవి మారుత్<br>గొట్టి ముక్కల ఆనంద బిహారీలాల్ |
| తూర్పు, పశ్చిమ గోదావరి | – వై.డి రామారావు<br>ఎస్. జానకిరామరాజు<br>జి. జానకిరామరాజు<br>పి.వి.వి.ఎస్ రామకృష్ణా రావు |
| కృష్ణా | – డా॥ కామినేని పట్టాభి రామయ్య<br>చెన్నుపాటి వజీర్ |
| గుంటూరు, ప్రకాశం | – జె. ఐరామ్మూర్తి<br>అల్లు రమేష్ రెడ్డి<br>డా॥ రాధా దేవి |
| నెల్లూరు, చిత్తూరు | – నర్రా శ్రీధర్, సునీతా చౌదరి<br>అంకయ్య చౌదరి<br>మద్దిపట్ల సిద్దయ్య నాయుడు |
| అనంతపురం | – డా॥ కొండయ్య<br>వేలూరు అశోక్ |
| కర్నూలు | – ఎం. ఓంకార్<br>టి.ఆర్ జగన్నాథ రెడ్డి<br>సునీతా చౌదరి<br>ఎస్.ఎ మాజిద్ |
| కడప | – ఎం. ఓంకార్<br>టి.ఆర్ జగన్నాథ రెడ్డి |
| హైదరాబాద్, రంగారెడ్డి | – నందిపేట రవీందర్<br>దాట్ల లక్ష్మి, దోసపాటి రాము |
| మెదక్ | – బందారు రామ్మోహనరావు<br>తుమ్మనపల్లి శ్రీనివాస్ |
| మహబూబ్‌నగర్ | – డా॥ పి.ఆర్ రావు<br>గౌస్ మొయినుద్దీన్<br>బెక్కెం రాం రెడ్డి<br>కె.ఎస్ రామ్ |
| నిజామాబాద్ | – ఈద చెన్నయ్య<br>డా॥ మర్రి రామిరెడ్డి<br>గన్‌రెడ్డి రాజారెడ్డి |
| నల్గొండ | – పి. భాస్కరరావు<br>శ్రీనివాస రెడ్డి<br>వి. విజేందర్ రెడ్డి |
| వరంగల్, కరీంనగర్ | – డా॥ పి. కోదండరామారావు<br>శ్రీనివాస్ (ఎల్ఎస్‌వో)<br>మహేశ్వరపు గట్టయ్య<br>బొల్లం రవి |
| ఆదిలాబాద్ | – విప్పర్తి లక్ష్మణ్ బాలాజీ<br>ఎం. సత్యనారాయణ ◆ |

# అసర్ సర్వే : రాష్ట్రంలో శోచనీయంగా పాఠశాల విద్య



గ్రామీణ భారతంలో పాఠశాల విద్యాస్థితి మీద ప్రథమ్ సంస్థ ప్రతి ఏటా అసర్ నివేదికను ప్రకటిస్తున్నది. 2013 అసర్ నివేదికను 2014 జనవరి 15న విడుదల చేశారు. ఈ నివేదికలు పాఠశాల విద్యా ప్రమాణాలకు అద్దంపడుతూ మన చదువు బండారాన్ని బైటపెడుతున్నది. ఈ నివేదికల పరంపరల తర్వాత కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాఠశాల విద్యాస్థితిని చక్కదిద్దే ప్రయత్నాలు చెయ్యడం లేదు. డబ్బు ఖర్చు, కొంత కేటాయింపుల పెంపు తప్పిస్తే ఫలితాల మీద దృష్టి పెట్టడం లేదు. ఈ డొల్లతనాన్ని మరోసారి అసర్ నివేదిక స్పష్టం చేస్తున్నది.

## జాతీయస్థాయి

జాతీయస్థాయిలో పాఠశాలలో పిల్లల నమోదు స్థితి చాలావరకు మెరుగైంది. ఈ సర్వే ప్రకారం 96.7 శాతం నమోదు వున్నట్లు తేలింది. ప్రభుత్వ పాఠశాలలతో పోల్చినప్పుడు ప్రయివేటు పాఠశాలలో నమోదు క్రమంగా పెరుగుతున్నది. ఇది కొంత ఊరట కలిగించే అంశంగా కనిపించినా పిల్లల చదువు ప్రమాణాలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా వుంది. గత సంవత్సరం మూడవ సంవత్సరం చదివే పిల్లలలో 1వ తరగతి స్థాయి పాఠం చదవగలిగే వారు 38.8 శాతం వుంటే ఇప్పుడు అది కేవలం 40 శాతంగానే వుంది. అలాగే 5వ తరగతిలో పిల్లలు 2వ తరగతి స్థాయి పాఠాలను చదవగలిగే వారు 2009లో 50.3 శాతం వుంటే అది కాస్తా 2013 నాటికి 41.1 శాతానికి పడిపోయింది.

### గ్రామీణ భారతంలో పాఠశాల విద్యాస్థితి

**Table 4: % Children by class and READING level**
**All schools 2013**

| Std | Not even letter | Letter | Word | Level 1 (Std I Text) | Level 2 (Std II Text) | Total |
|---|---|---|---|---|---|---|
| I | 47.3 | 32.3 | 12.6 | 4.4 | 3.6 | 100 |
| II | 23.1 | 33.4 | 20.8 | 11.8 | 11.0 | 100 |
| III | 12.7 | 25.0 | 22.2 | 18.5 | 21.6 | 100 |
| IV | 8.0 | 17.6 | 17.9 | 21.5 | 35.1 | 100 |
| V | 5.0 | 12.6 | 14.2 | 21.2 | 47.0 | 100 |
| VI | 3.0 | 9.0 | 10.8 | 20.1 | 57.1 | 100 |
| VII | 2.0 | 6.3 | 8.2 | 17.0 | 66.6 | 100 |
| VIII | 1.4 | 4.5 | 5.5 | 14.3 | 74.2 | 100 |
| Total | 14.1 | 18.5 | 14.4 | 15.8 | 37.2 | 100 |

How to read this table: Each cell shows the highest level in reading achieved by a child. For example, in Std III, 12.7% children cannot even read letters, 25% can read letters but not more, 22.2% can read words but not Std I level text or higher, 18.5% can read Std I level text but not Std II level text, and 21.6% can read Std II level text. For each class, the total of all these exclusive categories is 100%.

**Table 6: % Children by class and ARITHMETIC level**
**All schools 2013**

| Std | Not even 1-9 | Recognize numbers 1-9 | Recognize numbers 10-99 | Can subtract | Can divide | Total |
|---|---|---|---|---|---|---|
| I | 41.6 | 36.6 | 17.5 | 3.2 | 1.2 | 100 |
| II | 17.7 | 37.8 | 31.2 | 10.3 | 3.0 | 100 |
| III | 8.6 | 30.1 | 35.3 | 18.7 | 7.4 | 100 |
| IV | 5.2 | 21.0 | 32.8 | 25.3 | 15.8 | 100 |
| V | 3.3 | 15.0 | 29.5 | 26.7 | 25.6 | 100 |
| VI | 2.0 | 10.7 | 28.2 | 26.5 | 32.6 | 100 |
| VII | 1.4 | 7.5 | 26.4 | 26.0 | 38.8 | 100 |
| VIII | 1.0 | 5.5 | 23.2 | 24.3 | 46.0 | 100 |
| Total | 11.2 | 21.6 | 27.9 | 19.5 | 19.8 | 100 |

How to read this table: Each cell shows the highest level in arithmetic achieved by a child. For example, in Std III, 8.6% children cannot even recognize numbers 1-9, 30.1% can recognize numbers up to 9 but not more, 35.3% can recognize numbers up to 99 but cannot do subtraction, 18.7% can do subtraction but cannot do division, and 7.4% can do division. For each class, the total of all these exclusive categories is 100%.

చిన్న చిన్న లెక్కలు చెయ్యడంలోనూ పిల్లలు చాలా వెనకబడి వున్నారు. 3వ తరగతి చదువుతూ 2వ తరగతి స్థాయిలో చేయగల రెండు అంకెల తీసివేత (అప్పు తెచ్చుకుని చేసే పద్ధతిలో)లను 39.7 శాతం మంది మాత్రమే చేయగలుగుతున్నారు. అలాగే మూడు, నాలుగు తరగతులలో చేయవలసిన తేలికపాటి భాగహారాలను 5వ తరగతి పిల్లలలో 25.6 శాతం మాత్రమే చేయగలుగుతున్నారు. పిల్లల తరగతులకి వారి విద్యాస్థాయికి మధ్య ఎంత అగాధం వుందో ఈ సర్వే తేటతెల్లం చేస్తున్నది.

**ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ పాఠశాల విద్యాస్థితి**

**Table 4: % Children by class and READING level**
**All schools 2013**

| Std | Not even letter | Letter | Word | Level 1 (Std I Text) | Level 2 (Std II Text) | Total |
|---|---|---|---|---|---|---|
| I | 36.1 | 30.9 | 24.5 | 5.3 | 3.2 | 100 |
| II | 11.4 | 27.9 | 35.2 | 15.9 | 9.7 | 100 |
| III | 4.4 | 13.3 | 30.6 | 28.8 | 23.0 | 100 |
| IV | 3.3 | 5.5 | 18.9 | 31.0 | 41.3 | 100 |
| V | 2.0 | 4.0 | 13.5 | 22.5 | 58.0 | 100 |
| VI | 1.0 | 4.4 | 9.5 | 22.7 | 62.4 | 100 |
| VII | 0.6 | 2.2 | 7.2 | 16.1 | 73.9 | 100 |
| VIII | 0.4 | 1.4 | 4.4 | 13.1 | 80.6 | 100 |
| Total | 7.7 | 11.5 | 18.5 | 19.7 | 42.7 | 100 |

How to read this table: Each cell shows the highest level in reading achieved by a child. For example, in Std III, 4.4% children cannot even read letters, 13.3% can read letters but not more, 30.6% can read words but not Std I level text or higher, 28.8% can read Std I level text but not Std II level text, and 23% can read Std II level text. For each class, the total of all these exclusive categories is 100%.

## ఆంధ్రప్రదేశ్‌లో...

ఇక ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ పాఠశాలలో పిల్లల చదువు దారుణంగా వుంది. మూడవ తరగతి చదివే పిల్లలలో 4.4 శాతం మంది అక్షరాలు కూడా గుర్తించలేక పోతున్నారు. 13.3 శాతం మంది అక్షరాలను మాత్రమే గుర్తించగలుగుతున్నారు. కేవలం 3.6 శాతం మంది పదాలను చదవగలుగుతున్నారు. ఇక లెక్కల మాటకొస్తే ఒకటో తరగతి పిల్లలలో 1 నుండి 9 అంకెలను కూడా గుర్తించలేనివారు 28.4 శాతం వుండగా, 1-9 అంకెలను గుర్తించగలవారు 31.2 శాతంగానూ, 10-90 వరకు అంకెలను గుర్తించగలవారు 35.5 శాతంగా వున్నారు.

మూడవ తరగతి పిల్లలలో 2.1 శాతం మంది 1-9 వరకు అంకెలను కూడా గుర్తించలేక పోతున్నారు. 1-9 అంకెలను మాత్రమే గుర్తించగలవారు 8.6 శాతం, 10-99 వరకు అంకెలను గుర్తించగలవారు 51.2 శాతం కాగా చిన్న చిన్న తీసివేతలు చెయ్యగలవారు 32.9 శాతంగానూ, చిన్న చిన్న భాగహారాలు చెయ్యగలవారు కేవలం 5.2 శాతం మంది మాత్రమే వున్నారు.

**ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ పాఠశాల విద్యాస్థితి**

**Table 6: % Children by class and ARITHMETIC level**
**All schools 2013**

| Std | Not even 1-9 | Recognize numbers | | Can subtract | Can divide | Total |
|---|---|---|---|---|---|---|
| | | 1-9 | 10-99 | | | |
| I | 28.4 | 31.2 | 35.5 | 3.7 | 1.2 | 100 |
| II | 7.3 | 18.0 | 56.0 | 16.1 | 2.7 | 100 |
| III | 2.1 | 8.6 | 51.2 | 32.9 | 5.2 | 100 |
| IV | 1.4 | 4.2 | 34.1 | 43.5 | 16.8 | 100 |
| V | 0.8 | 2.3 | 23.2 | 37.0 | 36.7 | 100 |
| VI | 0.5 | 2.1 | 19.8 | 33.8 | 43.8 | 100 |
| VII | 0.4 | 0.8 | 16.0 | 29.1 | 53.7 | 100 |
| VIII | 0.4 | 0.6 | 13.0 | 27.7 | 58.4 | 100 |
| Total | 5.3 | 8.7 | 31.8 | 28.2 | 26.0 | 100 |

How to read this table: Each cell shows the highest level in arithmetic achieved by a child. For example, in Std III, 2.1% children cannot even recognize numbers 1-9, 8.6% can recognize numbers up to 9 but not more, 51.2% can recognize numbers up to 99 but cannot do subtraction, 32.9% can do subtraction but cannot do division, and 5.2% can do division. For each class, the total of all these exclusive categories is 100%.

ఈ చదువులతో పిల్లల భవిష్యత్తు ఏమౌతుందో అందరికీ తెలిసిందే. ప్రమాణాలు లేని చదువు పిల్లల జీవితాన్ని నాశం చేస్తుందే తప్ప ప్రయోజకుల్ని చెయ్యదు. ఈ స్థితిని మార్చకుండా సమాజం పురోభివృద్ధి చెందడం అసాధ్యం. కాని మన పాలకులకు పట్టని విషయం ఇదే. ఇంతకంటే విషాదం మరొకటి లేదు. ◆

# పార్టీ కార్యకలాపాల్లో మీడియా రోజువారీ అంశంగా ఉండాలి

**రాజకీయ పార్టీకి మీడియా ఎందుకు?**

రాజకీయం వ్యక్తిగత వ్యవహారం కాదు. రాజకీయపార్టీ సొంత ఆస్తికాదు. ఎంత ఎక్కువమందిని భాగస్వాముల్ని చేస్తే పార్టీ అంత పెరుగుతుంది. పార్టీలో ఎవరిపనివారు చేసుకుంటూ, పార్టీ నిరంతరం విస్తరిస్తూ వెళ్తుంటే ఇక ఆ పార్టీకి ఎప్పటికీ ఢోకా ఉండదు. అందుకే ప్రచారం అనేది రాజకీయపార్టీకి ఓ ప్రధానమైన నిత్యావసరం.

ముఖ్యంగా ప్రజల్ని ప్రభువులుగా నిలపాలనే లక్ష్యంతో వారికి గౌరవాన్నిచ్చే పార్టీకి మీడియా ఎంతో కీలకం. లోక్‌సత్తా ఎదుగుదలలో మీడియాను అంతర్భాగం చేసుకుని వారిని సద్వినియోగం చేసుకోవాలి. లోక్‌సత్తాకు ప్రధాన ఓటర్లయిన మధ్యతరగతివారు మీడియాను ఎక్కువగా అనుసరిస్తుంటారు కూడా.

ప్రచారంలో మీడియాది కీలకపాత్ర. పత్రికలు ప్రతిరోజూ వస్తాయి. టీవీలు ప్రతినిమిషం ప్రసారం చేస్తుంటాయి. వాటిని పూర్తిస్థాయిలో వినియోగించుకుని పార్టీని సాధ్యమైనంత ఎక్కువగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నించటం పార్టీవర్గాల ప్రాథమిక బాధ్యత. ప్రధాన కార్యాలయం నుంచి గ్రామస్థాయి వరకూ ఇలాగే ఉండాలి. మీడియాలో కన్పించటం రోజువారీ రొటీన్ కార్యక్రమంగా మారిపోవాలి. ముఖ్యంగా ఈవేళ్టిలా ఎన్నికల సమయంలో ప్రతి రోజూ వార్తల్లో ప్రభావశీలంగా ఉండటం అవసరం.

**మీడియా మనల్ని పట్టించుకోకున్నా .. మనం మీడియాను పట్టించుకోవాలి**

అయితే అధికారంలో లేని పార్టీకి, అధికారంలో ఉన్నవారిని సమానంగా పరిగణిస్తూ ఏవార్త సమాజానికి ఎక్కువ అవసరమో దాన్ని మీడియా ప్రచురించటం లేదు, ప్రసారం చేయటం లేదు అని ఆరోపణలతో కాలక్షేపం చేయకుండా, మనరోజువారీ కవరేజీకి మనవంతు ప్రణాళికలు మనమే వేసుకోవాలి. సాధ్యమైనంత ఎక్కువ కవరేజీని తెచ్చుకోవాలి. ఇందుకోసం మన ప్రయత్నం మనం చేస్తే, అద్భుతంగా కాకపోయినా, కావలసినంత కవరేజీని తెచ్చుకోవచ్చని చెప్పొచ్చు.

**కవరేజీకి ఎలాంటి ఏర్పాట్లు చేసుకోవాలి?**

మీడియా రాజకీయపార్టీ కృషిలో అంతర్భాగమని ముందు గుర్తించాక, అందుకు కావలసిన ఏర్పాట్లను పక్కాగా చేసుకుని ఇబ్బందిలేకుండా చూసుకోవాలి. మీడియా రిపోర్టర్ల అందరి వివరాల్నీ సేకరించండి. చిన్నపత్రికలు, వార,పక్ష, మాస పత్రికల్ని కూడా విడిచిపెట్టవద్దు. వారి ఫోన్‌నెంబర్లు, వీలుంటే అడ్రస్‌లు తీసుకోండి. వారికి లోక్‌సత్తా సమాచారాన్ని, సాహిత్యాన్ని ఇవ్వండి. పార్టీ కృషిని ఎప్పటికప్పుడు వివరిస్తుండండి. పార్టీ ఓ చిన్న కరపత్రాన్ని ప్రచురించినా దాన్ని వారికి ఇచ్చి మీ కృషిని వివరించండి. పార్టీ కవరేజీ కోసం వారి సహకారాన్ని కోరండి. సలహాలూ తీసుకోండి.

**వారానికి కనీసం నాలుగు రోజులు కవరేజీ తప్పనిసరి**

సాధారణ సమయాల్లో ప్రతిరోజూ కాకపోయినా, వారానికి కనీసం మూడు,నాలుగు రోజులు పార్టీ వార్తలు కవరయ్యేలా చూసుకోండి. ప్రతిరోజూ వుంటే ఇంకా మంచిది. అలాగే వార్తలు పంపటానికి ప్రతిరోజూ ప్రెస్‌కాన్ఫరెన్స్ పెట్టనక్కర్లేదు. వారానికి ఒకసారి ప్రెస్‌మీట్ పెట్టినా, మిగిలినరోజుల్లో మీడియా ప్రకటనలు (ప్రెస్‌నోట్స్) ఇవ్వొచ్చు. కానీ ఎన్నికల సమయంలో క్షేత్రస్థాయి కార్యక్రమాలతో పాటు మన ప్రతి స్పందననూ, భావాన్నీ ప్రజలకు తెలియచేసేందుకు విధిగా ప్రతి రోజూ కవరేజీ వచ్చేలా చూసుకోవాలి. ప్రకటన, ప్రెస్ మీట్, ఫీల్డు కవరేజీ ఇలా అన్ని రూపాలలో ఇందుకోసం ప్రయత్నించాలి. మనం చెప్పదల్చుకున్న కోణం వివరంగా తెలిసేలా శ్రద్ధ చూపాలి. మాట్లాడేటప్పుడు, ప్రెస్ నోట్ రాసేటప్పుడు ముఖ్యాంశాలను ముందుగా ఫోకస్ చేస్తూ, పార్టీ చెప్పదల్చుకున్న విషయాలు చక్కగా అర్థమయ్యేలా చూడాలి. మంచి పాఠకుడిలాగా ఆలోచిస్తూ, మనం ఓ వార్తను ఎలా ఉంటే

చదవాలనుకుంటామో అలా రాయాలి, అలా చెప్పాలి. అనవసర ప్రస్తావనలు లేకుండా సూటిగా రాయటం, మాట్లాడటాన్ని ప్రతిరోజూ అలవాటుగా మార్చుకోవాలి. ఓటర్లను ప్రభావితం చేయగలగాలి.

**ప్రెస్‌మీట్ నిర్వహించడం ...**

ప్రెస్‌మీట్‌లో ఇద్దరు నుంచి నలుగురు కూర్చోవచ్చు. కానీ ఒక్కరే మాట్లాడటం మంచిది. ఇద్దరు వరకూ ఫర్వాలేదు. మీడియాలో ఎవరి పేరు వచ్చింది అనే ఆలోచనకన్నా, పార్టీ భావం చక్కగా వెళ్లిందా లేదా, పార్టీ పేరు ప్రచారంలోకి వచ్చిందా లేదా అనేదే దృష్టిలో పెట్టుకోవాలి. బ్యాక్‌గ్రౌండ్‌లో పార్టీ పేరు, లోగోలు స్పష్టంగా కనిపిస్తున్న బ్యానర్ వుంచుకోవడం తప్పనిసరి.

పార్టీ వార్తలు కవర్ అవటం, అవి ప్రజల్ని ప్రభావితం చేయటం అవసరం. కానీ ప్రతిసారీ అలా సాధ్యంకాదు. ఎలాగోలా వార్తల్లో ఉండటం పార్టీకి అవసరంకాబట్టి, వివిధ అంశాలమీద అన్నిపార్టీల్లాగే స్పందించటం కూడా అవసరం.

**రాజకీయ ప్రయోజనమే ప్రాతిపదిక కావాలి**

ఇందుకోసం అవసరమైతే ప్రాక్టీస్ చేసుకోండి. ఏదివార్త, దేనిమీద స్పందించాలి అనేది నిర్ణయించటానికి రాజకీయ ప్రయోజనమే ప్రాతిపదిక కావాలి. ప్రతిరోజూ కనీసం నాలుగైదు పత్రికల్ని క్షుణ్ణంగా చదవండి. పార్టీ వర్గాలతో ఉదయాన్నే కనీసం నలుగురైదుగురు అనుభజ్ఞులతో మాట్లాడండి. ఏవార్తను ప్రచురించటం వల్ల ఆరోజు పార్టీకి ఎక్కువ ప్రయోజనం ఉంటుంది, ఆ వార్తను వేసుకోవటానికి మీడియా ఎలా స్పందిస్తుంది అనే విషయాల్ని స్పష్టంగా తెలుసుకోవాలి. చీకట్లో బాణాలు వేసే ధోరణి ఉండకూడదు. అయితే ఇది ఎన్నికల సమయం కాబట్టి, ఈ అంశాలపై వేగంగా కసరత్తు చేసి అవసరానికి తగ్గట్టుగా వ్యవహరించే శక్తిని సంతరించుకోవటం అవసరం. అవసరమైతే పార్టీ సీనియర్లను, శిక్షణాశాల విభాగాన్ని సంప్రదించండి.

**నిరంతర ప్రయత్నం వుండాలి**

ఒకవేళ మనం ఎంతో బాగా ఆశించినవార్త రాకపోయినా నిరాశచెందకూడదు. వరుసగా విఫలమైనా అది మన వ్యక్తిగత వైఫల్యంగా తీసుకోకుండా, మీడియావారిలో స్ఫూర్తిని నింపుతూ వారు లోక్‌సత్తా వార్తలు ఎక్కువగా కవర్‌చేసే విధంగా వారిని మలచుకోవాలి. కేవలం మీడియా ప్రకటనలు, ప్రెస్ మీట్లు మాత్రమే కాకుండా, కార్యక్రమాలు, సభలు, సమావేశాలు, అఖిలపక్షాలు వంటి వాటి ద్వారా కూడా వార్తల్లో ఉండాలి. ఈ విధంగా నిర్మించుకుంటే, పార్టీ శక్తిసామర్థ్యాలు పూర్తిస్థాయిలో వెలికివచ్చి మంచి ఫలితాలు సాధ్యమవుతాయి. అలాగే స్థానిక ఎలక్ట్రానిక్ మీడియాలో టాక్‌షోలకు వెళ్లేందుకు ప్రయత్నిస్తుండాలి. పార్టీ కార్యక్రమాల ఫోటోల్ని మీడియాకు తీసుకెళ్లి ఇచ్చేందుకు ఏర్పాట్లు చేసుకోవాలి.

**మీడియా బాధ్యత సాంకేతికంగా ఒకరికి అప్పజెప్పడం మంచిది**

మీడియాలో వార్తలు ఒక కొలిక్కి వచ్చేంతవరకూ అందరూ దాని మీద కృషి చేయాలి. ఆ తర్వాత మీడియా వ్యవహారాలు చూడటానికి ఒక వ్యక్తిని ఏర్పాటుచేసుకుంటే, అతను రెగ్యులర్‌గా వాటికి బాధ్యత తీసుకుంటారు. ఎన్నికల సమయంలో మీడియా విభాగం వార్ రూమ్‌లాగా పనిచేయాలి. అందుకని అవసరమైతే అదనపు సిబ్బందిని కూడా ఏర్పాటు చేసుకోవాలి.

మీడియా వ్యవహారాలు చూసే వారి వద్ద మీడియా వివరాలతోపాటు, వార్తల అప్‌డేట్లు కూడా తప్పనిసరిగా ఉండాలి. ప్రతిరోజూ ఉదయాన్నే కొన్ని వార్తల క్లిప్పింగుల్ని తీసుకోవటం లేదా వాటి వివరాల్ని రాసి పెట్టుకుని రికార్డు మెయిన్‌టెయిన్ చేయాలి. పార్టీ బాధ్యులకు తెలియజేస్తుండాలి.

పార్టీ కవరేజీని కార్యాలయం వద్ద నోటీస్‌బోర్డును ఏర్పాటుచేసి ప్రదర్శించాలి. మీడియాకు సంబంధించి ఏ విధమైన అదనపు సమాచారం కావాలన్నా పార్టీ కేంద్రకార్యాలయాన్ని నిస్సంకోచంగా సంప్రదించాలి. విధానపరమైన అంశాల మీద స్పందించేటప్పుడు పార్టీ పరిధిలోనే స్పందించాల్సుంటుంది. మీడియాకఎప్పుడూ వైవిధ్యాన్ని, తాజాదనాన్ని కోరుకుంటుంది. అందువల్ల ఏ ప్రకటన చేయాలన్నా, దానికి సందర్భాన్ని వెతుక్కోవటం, కొత్తగా అన్పించేలా చెప్పటం అవసరం. దీనికి సాధన కావాలి.

**మీడియాకి కావల్సిన సమాచారం కూడా ఇవ్వండి**

మీడియాలో మామూలు వార్తల్లాగేకాకుండా, వ్యాసాలు, లేఖలు వగైరాల రూపంలో కూడా రావొచ్చు. మీడియావారు ఏవైనా ప్రత్యేక కథనాలు రాసుకుంటుంటే, వారికి కావలసిన సమాచారాన్ని అందించటానికి ఎప్పుడూ ముందుండాలి. దానివల్ల వారికి లోక్‌సత్తా పట్ల సానుకూలత పెరుగుతుంది.

మంచి రాజకీయం అవసరం అర్థమవుతుంది. అలాగే మీడియావారిని అతిథుల్లా చూడండి. వారు ఆరోగ్యకరమైన, స్ఫూర్తిదాయక వాతావరణంలో వార్తలు రాసుకునే అవకాశం కల్పించండి.

**డెస్క్‌తో కూడా సత్సంబంధాలుండాలి**

మీడియాలో రిపోర్టర్లేకాకుండా, డెస్క్‌లో వార్తల్ని దిద్ది ప్రచురణకు పంపించేందుకు సబ్‌ఎడిటర్లు, న్యూస్‌ఎడిటర్లు వంటివారు ఉంటారు. వారికి కూడా పార్టీ భావజాలాన్ని అందించే సాహిత్యాన్ని ఇవ్వటం, వారి సలహాసూచనల్ని ఆహ్వానించటం మంచిది.

**పార్టీ వెబ్‌సైట్‌ను, పత్రికను కూడా ఉపయోగించుకోండి**

మరోవైపు, పార్టీ ప్రచారంలో భాగంగా వెబ్‌సైట్‌ను ఉపయోగించుకోవచ్చు. మీ ప్రాంతంలో వార్తల్ని ఫోటోలతోసహా ఎప్పటికప్పుడు పంపిస్తే, ప్రధాన కార్యాలయంలో నెట్‌లో పెడతారు. పార్టీ పత్రిక లోక్‌సత్తా టైమ్స్‌లో ప్రచురిస్తారు. నిరంతరం ప్రచారంలో ఉండటం, మీ గురించి ఎక్కువమందికి ఎప్పటికప్పుడు తెలుస్తుండటం మాత్రం అవసరమని గుర్తుంచుకోవాలి. ◆

# లోక్‌సత్తా నేత హైమాప్రవీణ్‌కు హార్వర్డ్ గౌరవం



'2014 - కీలక మలుపులో భారతదేశ భవిష్యత్తు ఎలా ఉండబోతోంది?' అంశంపై ఫిబ్రవరి 15న అమెరికాలోని బోస్టన్‌లో జరిగే హార్వర్డ్ ఇండియా సమావేశంలో పాల్గొనేందుకు హైదరాబాద్ సనత్ నగర్ నియోజకవర్గ లోక్‌సత్తా పార్టీ అభ్యర్థి శ్రీమతి హైమా ప్రవీణ్‌కు ఆహ్వానం లభించింది. భారత్ నుంచి ఈ రాజకీయ చర్చలో ఆహ్వానం అందుకున్న మహిళ హైమా ప్రవీణ్ ఒక్కరే కావటం విశేషం.

గతంలో వివిధ విభాగాలలో అమర్త్యసేన్, పి. చిదంబరం, నవీన్ జిందాల్ వంటి ప్రముఖులు హార్వర్డ్ ఇండియా సమావేశాలలో పాల్గొన్నారు.

గత రెండేళ్లుగా సనత్ నగర్ నియోజకవర్గంలో వివిధ ప్రజాసమస్యలపై చురుగ్గా పోరాడుతున్నారు. 2014 అసెంబ్లీ ఎన్నికలకు లోక్‌సత్తా పార్టీ ప్రకటించిన తొలి అభ్యర్థుల జాబితాలో హైమా ప్రవీణ్‌కు సనత్ నగర్ నియోజకవర్గ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారు.

**మహిళలకు పెద్ద పీట వేసే పార్టీ లోక్‌సత్తాయే**


లోక్‌సత్తా మహిళా యువనేతకు ఈ అరుదైన గౌరవం లభించిన సందర్భంగా మహిళాసత్తా ఆధ్వర్యంలో లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా **మహిళాసత్తా అధ్యక్షురాలు ఎన్. సరోజాదేవి మాట్లాడుతూ..** హైమా ప్రవీణ్‌లాగా సామర్థ్యం, నిబద్ధత, కష్టపడి పనిచేసే తత్వంగల మహిళలు మంచి రాజకీయాలలో భాగస్వాములయ్యేందుకు ముందుకొచ్చి లోక్‌సత్తా పార్టీ వేదికను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అభినందన కార్యక్రమంలో యువసత్తా రాష్ట్ర అధ్యక్షుడు పి. శివాజీ, లోక్‌సత్తా పార్టీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు దోసపాటి రాము, జూబ్లీహిల్స్, మల్కాజిగిరి పార్టీ అభ్యర్థులు బొంతు సాంబిరెడ్డి, దిలీప్ శంకర్ రెడ్డి, గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షురాలు ఎస్. గజానని, సహాయ కార్యదర్శి పేరిచర్ల భవాని, రమాదేవి, లావణ్య, విజయ కుమారి, టి.వి రాణి, రజని, సుధ, రాజీవ్, బాబు ఆనంద్, సాయి, రాజు తదితర పార్టీ నేతలు పాల్గొన్నారు. ◆

# మార్చి 8 – అంతర్జాతీయ మహిళాదినోత్సవం

- ఎ. అన్నపూర్ణ

అంతర్జాతీయ మహిళా ఉద్యమానికి 100 ఏళ్లపై బడిన చరిత్ర వుంది. శ్రామిక మహిళల సమాన హక్కుల కోసం ప్రారంభమైన ఉద్యమం క్రమేణా వివక్ష లేని సమాజం కోసం, ఓటు హక్కు కోసం, పాలనాధికారంలో భాగస్వామ్యం కోసం, మహిళా సాధికారత ఉద్యమంగా రూపుదిద్దుకుని ప్రపంచవ్యాపిత ఉద్యమంగా విస్తరించింది.



20 శతాబ్దపు తొలి సంవత్సరంలోనే అంతర్జాతీయ మహిళా ఉద్యమానికి బీజాలు పడ్డాయి.

1911లో కోపెన్‌హేగెన్ తీర్మానాన్ని అనుసరించి మార్చి 19న అంతర్జాతీయ మహిళాదినోత్సవాలు ఆసియా, డెన్మార్క్, జర్మనీ, స్విడ్జర్లాండ్ తదితర దేశాలలో నిర్వహించారు. ఇలా అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఆరంభం అయింది. దాదాపు 10 లక్షల మంది ఈ ప్రదర్శనలలో పాలుపంచుకున్నారు. పనిహక్కు – ఓటు హక్కు – పాలనలో భాగస్వామ్య హక్కు, వివక్ష తొలగింపు అన్నీ అంశాలు నినాదాలయ్యాయి.

1975లో ఐక్యరాజ్యసమితి మార్చి 8వ తేదీని అంతర్జాతీయ మహిళాదినోత్సవంగా ప్రకటించింది. వివక్ష లేని సమాజం కోసం – మహిళా సాధికారత కోసం సాగుతున్న ఈ ప్రజాస్వామిక ఉద్యమంలో అందరూ భాగస్వాములు కావాలి. ఈ పోరాటం కేవలం మహిళలదే కాదు– అందరిదీ.

1995 బీజింగ్ (చైనా)లో జరిగిన సమావేశంలో 12 ముఖ్యమైన అంశాలపై చర్చలు జరిగాయి.

1. మహిళల ఆర్థిక దుస్థితిని తొలగించడం. 2. విద్యావకాశాలు మెరుగుపరచడం. 3. ఆరోగ్యరక్షణ అసమానతల తొలగింపు. 4. స్త్రీల పట్ల హింసను రూపుమాపడం. 5. రక్షణ. 6. ఆర్థిక నిర్ణయాలు విధానాల విషయంలో భాగస్వామ్యం. 7. వివిధ స్థాయిలో అధికార పంపిణీ విషయంలో స్త్రీ, పురుష అసమానత్వ తొలగింపు. 8. స్త్రీ అభ్యుదయం. 9. స్త్రీల హక్కులు. 10.సామాజిక అభ్యున్నతికి స్త్రీలు నిర్వహించే పాత్రను ప్రచార సాధనాల ద్వారా తెలియచేయడం. 11. ప్రకృతి వనరులు పర్యావరణ పరిరక్షణలో స్త్రీల పాత్ర. 12. ఆడ పిల్లలకు సంబంధించిన సమస్యలను చర్చించడం.

భారతదేశంలో 1992లో పై అంశాల ప్రాధాన్యతతో మహిళా కమీషన్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కమీషన్ ప్రకారం మహిళా హక్కుల పరిరక్షణ జరుగుతుంది. మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖలో భాగంగా స్త్రీ శిశు అభివృద్ధి సంస్థ ఏర్పాటు అయింది. 1988–2000 సం॥ల మధ్య మహిళలకు మరెన్నో పథకాలు ఏర్పాటు చేశారు. ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ సంస్థలు ఏర్పాటు చేశారు. ఈ సంస్థలు భారతదేశంలోని వివిధ రాష్ట్రాలకు సహాయ సహకారాలు అందిస్తున్నాయి. ఈ విధంగా మహిళా దినోత్సవం యొక్క ప్రాముఖ్యత వలన ఎందరో మహిళలకు న్యాయం జరుగుతుంది. వారికి హక్కులు, అవకాశాలు లభించాయి. ప్రతి సంవత్సరం ఈ మహిళా దినోత్సవం ఆనవాయితీగా జరుపుకోని ఏవేవో ఉపన్యాసాలు ఇవ్వడం కాకుండా మనం ఎంతవరకూ మహిళా సాధికారతను సాధించగలిగాం అని ఆలోచించు కోవలసిన అవసరం ఎంతైనా వుంది. అప్పటి సమస్యలు వేరు. పరిస్థితులు వేరు. ఇప్పుడు ఈ 20వ దశాబ్దంలో 2014వ సంవత్సరానికి మహిళలు సాధించిన విజయాలతో పాటు కొత్త సమస్యలు ఎదుర్కోవడం గురించి చర్చించాలి. ప్రస్తుత భారతదేశంలో మహిళలపై జరిగే అత్యాచారాలు, గృహహింస, వారి జీవితాలకు భద్రత లేకపోవడం వంటివి అత్యంత విచారకరం. మొక్కుబడిగా మహిళా దినోత్సవం జరుపుకోవడం కాకుండా ప్రస్తుత పరిస్థితుల్లో మహిళల రక్షణకు అవసరమైన చర్చ జరగాలి. ◆




# ఢిల్లీలో జేపీపై దాడి

## టీ-లాయర్ల అనాగరిక చర్య

ఢిల్లీలోని ఏపీ భవన్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. లోక్‌సత్తా అధినేత జయప్రకాష్ నారాయణ్‌పై తెలంగాణ న్యాయవాదులు దాడికి దిగారు. ఆయన కాలర్ పట్టుకుని లాగారు. జేపీ విలేకరులతో మాట్లాడుతుండగా.. తెలంగాణ న్యాయవాదులు, విద్యార్థులు అడ్డుకున్నారు. పరిస్థితి తీవ్రంగా మారడంతో పోలీసులు ఆందోళనకారులను ఒక్కొక్కరిని వెనక్కి లాగి ఆయనను పక్కకు తీసుకెళ్లారు. ఈ సమయంలో ఆందోళనకారుల్లో ఒకరు.. జేపీ కాలర్ పట్టుకుని ముందుకు లాగి కొట్టేందుకు ప్రయత్నించారు. దీంతో పోలీసులు అతడిని పక్కకు లాగి జేపీని అక్కడ్నుంచి తరలించారు.

**కేంద్రం నమ్మకం కలిగించలేకపోయింది : జేపీ**

అంతకుముందు ఆయన ఉత్తరాంధ్ర, రాయలసీమ, తెలంగాణ ప్రాంత నేతలతో కలిసి విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ విభజన అంశంపై అసెంబ్లీలో విస్పష్టమైన ప్రకటన లోక్‌సత్తా చేసిందని తెలిపారు. ఈ విషయంలో అన్నకు తమ్ముడికి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి పోవాలని ఆకాంక్షించారు. సామరస్య పరిష్కారం చూపించి, అందరి ప్రయోజనాలను కాపాడాలని కోరారు. ఇందుకు ఏడు పరిష్కారాలతో కూడిన రోడ్ మ్యాప్‌ను లోక్‌సత్తా చూపించిందని, దాని ప్రకారమే నడుస్తున్నామని కేంద్రం ప్రభుత్వం చెప్పిందని, కానీ బిల్లులో సవరణలు చూస్తే.. ప్రధానంగా నదీ జలాల ప్రాజెక్టుల విషయంలో తెలంగాణ ప్రాంతానికిగానీ, రాయలసీమకుగానీ, కోస్తాంధ్రకుగానీ గతం కంటే భవిష్యత్తు బాగుంటుందనే నమ్మకాన్ని కలిగించలేక పోయారని విమర్శించారు. విభజన తర్వాత ఉత్పన్నమయ్యే సమస్యల పరిష్కారాన్ని కేంద్రం చూపించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అన్నకు తమ్ముడికి మధ్య చిచ్చుపెట్టి వినోదం చూడటం కాదని.. రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలను ప్రత్యేక వెనుకబడిన ప్రాంతాలుగా గుర్తించి వాటికి తగిన ఏర్పాట్లు చేయాలని కోరారు. రాష్ట్రంలో మిగిలిన ప్రాంతాల్లో ఉపాధి కల్పన, నదీ జలాల పంపకం తేలిక కావాలని సూచించారు. ఈ అంశాలకు పార్లమెంటులో పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. దీనిపై కేంద్ర, రాష్ట్ర మంత్రులకు, భాజపా నాయకులకు ఐదు అంశాలతో లేఖ రాశానని తెలిపారు. తెలంగాణ విషయంలో ఎత్తుకు పైఎత్తులు వేస్తూ రాజకీయం చేస్తే ఎప్పటికి పరిష్కారం లభించదని స్పష్టం చేశారు. దీనికి సామరస్య పరిష్కారాన్ని లోక్‌సత్తా చూపించిందని తెలిపారు. దానిని అమలు చేస్తే విభజన తర్వాత మా బతుకు బాగుంటుందనే విశ్వాసం మూడు ప్రాంతాల్లో నెలకొంటుందని అన్నారు. ఎన్నికల్లో ఎత్తుగడల్లో భాగంగా కొందరు తాత్కాలిక విద్వేషాలను రెచ్చగొడుతున్నారని, ఏ పార్టీ ఏ రకంగా ప్రవర్తిస్తుందో, ఎటువంటి ఎత్తుగడలు వేస్తుందో చెప్పలేమని, వారేం చేసినా మన బతుకులు నాశనం కాకూడదని అభిప్రాయపడ్డారు. ఇలా ప్రసంగిస్తుండగా..ఆయన చుట్టూ ఉన్న న్యాయవాదులు, విద్యార్థి సంఘాల నేతలు ఒక్కసారిగా ముట్టడించి తెలంగాణ నినాదాలు చేశారు. దాడి చేశారు. ఈ ఘటనలో పోలీసులు ఎవరినీ అరెస్టు చెయ్యలేదు.

# ఢిల్లీలో జేపీపై దాడి...

# రాష్ట్రంలో వెలువెత్తిన నిరసనలు

## హైదరాబాద్‌లో...

### ట్యాంక్‌బండ్ వద్ద...

ఢిల్లీలో లోక్‌సత్తా వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్యే జయప్రకాష్ నారాయణ్‌పై తెలంగాణవాదుల దాడిని నిరసిస్తూ ఆ పార్టీ ఆధ్వర్యంలో లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద చేపట్టిన ధర్నా, నిరసన ఉద్రిక్తతకు దారితీసింది. ధర్నా చేస్తుండగానే లోక్‌సత్తా పార్టీ నేతలను పోలీసులు బలవంతంగా అరెస్టు చేసి నాంపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆ పార్టీ అధ్యక్షుడు కటారి శ్రీనివాసరావు, హైకోర్టు అడ్వకేట్ నాగేంద్రబాబులతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా కార్యకర్తలను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా కటారి శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతుండగానే పోలీసులు వారిని చుట్టుముట్టారు. జేపీపై దాడిని నిరసిస్తూ నిరసన వ్యక్తం చేస్తుంటే పోలీసులు మాపై కూడా దాడిచేయడం సమంజసం కాదని కటారి అన్నారు. ఈ నిరసనలో పార్టీ గ్రేటర్ అధ్యక్షుడు దోసపాటిరాము, రోహిత్‌కుమార్, కొంగర గంగాధర్‌రావు, హైమాప్రవీణ్, సాంబిరెడ్డి, నాయకులు శ్రీనివాస్, భవాని, బాబు ఆనంద్, నందకుమార్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.




## హైదరాబాద్‌లో...

### ఇందిరాపార్క్ వద్ద...

న్యూఢిల్లీలోని ఏపీ భవన్ వద్ద తమ పార్టీ జాతీయ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్‌పై ఫిబ్రవరి 11న దాడి చేసిన దోషులను అరెస్టు చేసి, శిక్షించేలా తక్షణం చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎన్. కిరణ్ కుమార్ రెడ్డికి లోక్‌సత్తా పార్టీ డిమాండ్ చేసింది.

జేపీపై దాడికి ప్రతిఘటనగా ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద

# ఢిల్లీలో జేపీపై దాడి...

# రాష్ట్రంలో వెలువెత్తిన నిరసనలు

**లోక్‌సత్తా పార్టీ నిర్వహించిన ధర్నాలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కటారి శ్రీనివాసరావు మాట్లాడుతూ...** ఫిబ్రవరి 11 రాత్రి లిబర్టీ జంక్షన్‌లోని డా॥ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన చేస్తున్న లోక్‌సత్తా పార్టీ కార్యకర్తలపై చేయి చేసుకుని దూషించిన పోలీసు సిబ్బందిపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

లోక్‌సత్తా ఏనాడూ రెండు నాల్కల ధోరణిని అవలంబించ లేదని, రాష్ట్రాన్ని బలవంతంగా కలిపిఉంచటం, విడదీయటం సాధ్యం కాదని తొలినుంచీ చెబుతోందని కటారి అన్నారు. రాష్ట్రంలోని మూడు ప్రాంతాలప్రయోజనాలనూ పరిరక్షిస్తూ, భవిష్యత్తులో అన్ని ప్రాంతాలలోని తెలుగువారూ తలెత్తుకుని బతికేలా చేసే సమగ్ర, సామరస్య పరిష్కారాన్ని జేపీ మాత్రమే ఆవిష్కరించారని, దాన్ని సాధించటం కోసం అందరి మద్దతునూ కూడగడుతున్నారని అన్నారు. జేపీని అభినందించటానికి బదులు కొందరు తెలంగాణవాదులు ఆయన మీద భౌతికదాడులకు దిగారని అన్నారు.

**లోక్‌సత్తా పార్టీకి సంఘీభావం తెలిపేందుకు వచ్చిన కాంగ్రెస్ నేత ఎన్. తులసిరెడ్డి మాట్లాడుతూ..** భావ ప్రకటనా స్వేచ్ఛను అడ్డుకోవటం విపరీత పరిణామాలకు దారితీస్తుందని అన్నారు. జేపీ మీద దాడి అప్రజాస్వామికంగా తెలుగుదేశం నేత లింగారెడ్డి అభివర్ణించారు. లోక్‌సత్తా పోరాటానికి ఎంసీపీఐ (యు) నేత వెంకట రెడ్డి పూర్తి మద్దతు ప్రకటించారు.

ధర్నాలో లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అల్లు రమేష్ రెడ్డి, కార్యదర్శి నందిపేట రవీందర్, మహిళాసత్తా రాష్ట్ర అధ్యక్షురాలు ఎన్. సరోజాదేవి, యువసత్తా రాష్ట్ర అధ్యక్షుడు పి. శివాజీ, లోక్‌సత్తా పార్టీ గ్రేటర్ హైదరాబాద్ విభాగం అధ్యక్షుడు దోసపాటి రాము, ఉపాధ్యక్షులు గొర్తి శ్రీనివాస్, పేరిచర్ల భవానీ, పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులు కొంగర గంగాధరరావు, హైమా ప్రవీణ్, బంతు సాంబిరెడ్డి, పార్టీ నేతలు ఎన్. నాగేంద్రబాబు, రోహిత్ కుమార్ తదితరులు పాల్గన్నారు.

**ధర్నాకి ముందు కటారి శ్రీనివాసరావు, దోసపాటి రాము డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి. ప్రసాదరావుని కలిసి,** మహిళలు, మీడియా సిబ్బంది సహా లోక్‌సత్తా నేతలపై భౌతిక హింసకు, అసభ్య పదజాలంతో దుర్భాషలకు పాల్పడిన సైఫాబాద్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఉమేందర్‌ని సస్పెండ్ చేయాలని



విజ్ఞప్తి చేశారు.

తన 18 ఏళ్ల చరిత్రలో లోక్‌సత్తా ఏనాడూ శాంతిభద్రతల్ని, ప్రజల జీవితాల్ని ఆటంక పరిచే ఉద్యమాలు చేయలేదని డీజీపీకి కటారి వివరించారు. జేపీపై దాడికి నిరసనగా ఫిబ్రవరి 11 రాత్రి లోక్‌సత్తా శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తుండగా, సైఫాబాద్ పోలీసులు విచక్షణారహితంగా హింసకు పాల్పడ్డారన్నారు. పోలీసు చర్యలో దోసపాటి రాము గాయపడ్డారని, తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

## గుంటూరులో...

లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షులు డా॥ జయప్రకాష్ నారాయణ్‌పై కొందరు తెలంగాణా న్యాయవాదులు చేసినదాడి భావప్రకటనా స్వేచ్ఛను హరించేదిగా, ప్రజాస్వామ్య వాదంపై జరిగినదాడిగా ఉందని, న్యాయవాద వృత్తిలో ఉండి వీధి రౌడీలలాగా ప్రవర్తించటం సభ్యసమాజం వ్యతిరేకించాలని, లోక్‌సత్తా పార్టీపైగాని, కార్యకర్తలపైగాని దౌర్జన్యాలు, దాడులకు దిగితే ఇకపై ఉపేక్షించేది లేదని లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షులు గద్దె వెంకటేశ్వరరావు అన్నారు. ఢిల్లీలో ఎ.పి. భవన్ వద్ద మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జేపీపై జరిగిన దాడిని నిరసిస్తూ బ్రాడీపేట-4/18లోని జిల్లా పార్టీ కార్యాలయం నుండి లాడ్జి సెంటర్‌లోని డా॥ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీని నిర్వహించారు. దాడులకు పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన ధర్నాలో జిల్లా కార్యదర్శి మాదాసు భానుప్రసాద్ మాట్లాడుతూ.. ప్రాంతాలవారీగా ఉన్న ఆర్థికలోటును ఏ రకంగా భర్తీ చేస్తారో, నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల అనుమతులకు సంబంధించిన సాంకేతిక అంశాలను స్పష్టత లేకుండా తెలుగు ప్రజలను సంక్షోభంలోకి నెట్టి నాటకాలాడుతున్నారని అలాంటి వారిని వదిలిపెట్టి జేపీపై దాడికి దిగటాన్ని అందరూ ఖండించాలని కోరారు. నగర అధ్యక్షులు జి.పద్మారాణి మాట్లాడుతూ రాష్ట్ర సంక్షోభాన్ని నివారించి మూడు ప్రాంతాలకు మేలు చేకూర్చే విధంగా కృషి చేస్తున్న జేపీపై దాడి హేయమైన చర్య అని, తెలంగాణ న్యాయవాదులు కొందరు అజ్ఞానంతో ఉన్మాదులుగా ప్రవర్తిస్తున్నారని, భౌతికదాడుల వల్ల ఏమి సాధించలేరని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యవర్గ సభ్యులు, యువత మరియు మహిళలు పాల్గొన్నారు.

# ఢిల్లీలో జేపీపై దాడి...

# రాష్ట్రంలో వెలువెత్తిన నిరసనలు

## అనకాపల్లిలో...

లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షులు డా॥ జయప్రకాష్ నారాయణ్‌పై దాడికి దిగటాన్ని అనకాపల్లి నియోజకవర్గంలోని లోక్‌సత్తా పార్టీ తీవ్రంగా ఖండించింది. ఢిల్లీలో ఎ.పి. భవన్ వద్ద మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జేపీపై జరిగిన దాడిని నిరసిస్తూ అనకాపల్లి నియోజకవర్గ అధ్యక్షులు వేలం నూకరాజు రైల్వేస్టేషన్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు ప్రాంతాల ప్రజలు విభజన వలన నష్టపోరాదని, ఉత్తరాంధ్ర, రాయలసీమలకు రెవెన్యూ లోటు భర్తీ చేసేలా చట్టబద్ధత కల్పించాలని, నీరు, మౌలిక సదుపాయాలలో చట్టబద్ధత కల్పించకుండా విభజన చేయరాదని చెబుతున్న జేపీపై తెలంగాణ న్యాయవాదులు దాడి చేయడాన్ని ఖండించారు. దాడి చేసిన వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శి యర్రమళ్ళ గణేష్, పలకా నర్సింగరావు, ఫణికుమార్,

# ఢిల్లీలో జేపీపై దాడి...

# రాష్ట్రంలో వెలువెత్తిన నిరసనలు

## చీపురుపల్లిలో...

లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షులు డా॥ జయప్రకాష్ నారాయణ్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ లోక్‌సత్తా పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రెడ్డి లక్ష్మునాయుడు నిరాహారదీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభజన వల్ల ఏ ప్రాంతం నష్టపోకుండా న్యాయం చేయాలంటున్నా జేపీపై తెలంగాణ న్యాయవాదులు దాడికి దిగటాన్ని ఖండిస్తూ, దాడి చేసిన వారిని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జి. సత్యనారాయణ, రేడిగి దాలినాయుడు, ఆర్.సత్యనారాయణ, వై.రమణ, ఎ.వెంకటరమణ, శ్రీహరి, ఆర్.అప్పలనాయుడు, గందవరపు రాము తదితరులు పాల్గొన్నారు.

## గుంతకల్లులో...

ఢిల్లీలో లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షులు డా॥ జయప్రకాష్ నారాయణ్‌పై జరిగిన దాడికి నిరసనగా స్థానిక ఎస్ఎల్వీ టాకీస్ రోడ్‌లో లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ గుంతకల్లు కన్వీనర్ నాగార్జున మాట్లాడుతూ.. ఢిల్లీలో తెలంగాణ న్యాయవాదులు జేపీపై దాడి చేయడం అప్రజాస్వామ్యమన్నారు. రాష్ట్రాన్ని ఏకపక్షంగా విభజించడం వల్ల ఇరుప్రాంతాల ప్రజలు నష్టపోతారని జేపీ విలేకరులతో మాట్లాడుతున్నా సమయంలో దాడికి పాల్పడడాన్ని ఖండించారు. వెంటనే దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మధు, ఖలీల్, ఆంజనేయులు, సారిక, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాయదుర్గంలో...

ఢిల్లీలో లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షులు డా॥ జయప్రకాష్ నారాయణ్‌పై జరిగిన దాడికి ఖండిస్తూ స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ఆ పార్టీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. స్వతంత్ర రైతు సంఘాల జిల్లా అధ్యక్షుడు బాబు ఆధ్వర్యంలో నాయకులు అబ్దుల్లా, నాగరాజు, రఘు, గోవిందరెడ్డి, పురుషోత్తమరెడ్డి తదితరులు నోటికి నల్లగుడ్డ కట్టుకుని నిరసన తెలియజేశారు. ప్రాంతాల వారీగా మాట మార్చుతున్న పార్టీలను వదిలేసి మార్గాలు చూపిస్తున్న నేతపై తెలంగాణ న్యాయవాదులు దాడి చేయడం సిగ్గుచేటని వారు పేర్కొన్నారు. వెంటనే దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని

ఎవిఎస్.ప్రకాష్, సూర్యారావు, ఎ.ఆదినారాయణరావు, యువసత్తా సభ్యులు పాల్గొన్నారు.

## కర్నూలులో...

ఢిల్లీలోని ఎ.పి. భవన్ వద్ద లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షులు డా॥ జయప్రకాష్ నారాయణ్‌పై కొందరు తెలంగాణా న్యాయవాదులు దాడి చెయ్యడం అమానుషంగా, అనైతికంగా, సభ్యసమాజం సిగ్గుపడేలాగా ఉందని, జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.ఓంకార్, పార్టీ నగర కార్యదర్శి గద్వాల ఈరన్న, నగర ఉపాధ్యక్షులు జయరామిరెడ్డి, నగరకోశాధికారి వజ్జా వెంకటేశ్వర్లు, సూర్యకుమార్, శ్రీనాథ్, పార్టీ నాయకులు అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించి, తెలంగాణ న్యాయవాదుల దిష్టిబొమ్మను తగులబెట్టారు. దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది అక్బర్ రహ్మాన్, సునీల్‌కుమార్, రమణ, శ్రీను, సుమన్, దాసు, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

లోక్‌సత్తా తాలుకా అధ్యక్షుడు అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు.

## కూకట్‌పల్లిలో...

ఏపీ భవన్‌లో లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షులు డా॥ జయప్రకాష్ నారాయణ్‌పై జరిగిన దాడికి నిరసనగా కూకట్‌పల్లి నియోజకవర్గ కార్యకర్తలు కెపిహెచ్‌బి రోడ్ నెం.1లో గల గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అధ్యక్షులు కొమ్ము సత్తయ్య మాట్లాడుతూ.. ఏపీ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతున్నా జేపీపై తెలంగాణ న్యాయవాదులు దాడి చేయడాన్ని ఖండించారు. వెంటనే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వంశీప్రసాద్, ఓంశంకర్, భాదినేని ప్రసాద్, కుమార్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, రామమోహన్‌రావు, మహేష్, జీవనలత, గంగాభవాని, పద్మజారాణి, పేరిచర్ల భవాని, డెక్క ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## చిలకలూరిపేటలో...

ప్రజాస్వామ్యంలో అందరికీ వాక్ స్వాతంత్ర్య హక్కు ఉంటుందని లోక్‌సత్తా జిల్లా ప్రధాన కార్యదర్శి మాదాసు భానుప్రసాద్ తెలిపారు. ఢిల్లీలో లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షులు డా॥ జయప్రకాష్ నారాయణ్‌పై జరిగిన దాడి చేయడాన్ని ఖండిస్తూ స్థానిక లోక్‌సత్తా పార్టీ నేతలు నిరసన వ్యక్తం చేశారు.ముందుగా పట్టణంలో ప్రదర్శన నిర్వహించి ఎన్‌ఆర్‌టీ కూడలిలో రాస్తా రోకో చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని పార్టీల నాయకులతో సామరస్యంగా సమావేశం ఏర్పాటు చేస్తే తెలంగాణ న్యాయవాదులు దౌర్జన్యం చేయడం బాధకరమని పేర్కొన్నారు. దాడి చేసిన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు మురికిపూడి ప్రసాద్, సాదిక్, సరిగమ కుమార్, కె.ఆంజనేయులు, సిద్దిక్, షరీఫ్ పాల్గొన్నారు.

## పార్వతీపురంలో...

ప్రజల మనిషి అయిన లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షులు డా॥ జయప్రకాష్ నారాయణ్‌పై తెలంగాణ న్యాయవాదులు దాడి చేయడాన్ని ప్రజలు హర్షించరాని లోక్‌సత్తా జిల్లా అధ్యక్షులు డి.సాయిపార్ధసారథి అన్నారు. ఢిల్లీలో జేపీపై తెలంగాణ వాదులు దాడి చేయడాన్ని నిరసిస్తూ బాలాజీ జంక్షన్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ న్యాయవాదులు వృత్తికే కళంకం తెచ్చారని మండిపడ్డారు. తెలుగుజాతిని కించపర్చే విధంగా వారు ప్రవర్తిస్తున్నారని, అది వారి నీచ సంస్కృతికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దేవర ఈశ్వరరావు, ఎంఎస్ఎన్ రాజు, మహిళాసత్తా సుభద్రాదేవి, ఆర్.పద్మావతి, రమణానందం, గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

## చింతలపూడిలో...

ఢిల్లీలో రాష్ట్ర ప్రజల సమస్యపై సముచిత రీతిలో న్యాయం చేయాలని తమ వాణిని వినిపించడానికి వెళ్ళిన లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షులు డా॥ జయప్రకాష్ నారాయణ్‌పై తెలంగాణ న్యాయవాదులు దాడి చేయడాన్ని నియోజకవర్గ లోక్‌సత్తా నాయకులు, కార్యకర్తలు తీవ్రంగా ఖండించారు. మేడబడి సెంటర్ నుంచి పాత బస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకు ప్రదర్శన జరిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎం. వెంకటేశ్వరరావు, నియోజకవర్గ నాయకుడు ఆర్నేపల్లి అప్పారావు, ఎం.పుల్లారావు, కె.వేణుగోపాల్, కేవీ రామకృష్ణ, వై.గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## రామచంద్రపురంలో...

ఢిల్లీలో లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షులు డా॥ జయప్రకాష్ నారాయణ్‌పై జరిగిన దాడికి నిరసనగా రామచంద్రపురం నియోజకవర్గ లోక్‌సత్తా పార్టీ అధ్యక్షులు దేవు సదానందమూర్తి, జిల్లా కార్యదర్శి బిరుదా సత్యనారాయణమూర్తి, గొల్లపాలెం అధ్యక్షులు కొప్పుల బుజ్జి ఆధ్వర్యంలో గొల్లపాలెం, కాజులూరు సెంటర్ నుండి మెయిన్‌రోడ్ మీదుగా నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు జి.వెంకటేశ్వరరావు, పుల్లెపు అప్పారావు, ఎస్.వి.ఎస్.భగవానులు, మేడిశెట్టి గోపాలకృష్ణ, కె.భూలోకరాయుడు, వెలగా భీమశంకరం, మేడిశెట్టి శ్రీను, వెలగా శివ, డి.రమేష్‌కుమార్, కొప్పాక చౌదరి, యం.ఆనంద్ మరియు పుర ప్రజలు పాల్గొన్నారు. ◆

# నియోజకవర్గ ఎన్నికలకు సారథ్య సంఘం




కూకట్‌పల్లి నియోజకవర్గ కార్యాలయంలో నియోజకవర్గ పార్టీ అధ్యక్షులు కొమ్ము సత్తయ్య అధ్యక్షతన నియోజకవర్గ పార్టీ కార్యవర్గం, డివిజన్ల అధ్యక్ష, కార్యదర్శులు, ఇతర నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు సమాయత్తంలో భాగంగా నియోజకవర్గ ఎన్నికల సారధ్య సంఘాన్ని ఏర్పాటు చేస్తూ సభ్యుల పేర్లను గౌరవ శాసన సభ్యులు, పార్టీ జాతీయ అధ్యక్షులు డా॥ జయప్రకాష్ నారాయణ్ ప్రకటించారు. ఈ సమన్వయ సంఘంలో యల్.వి.రామరాజు, కొమ్ము సత్తయ్య, దాట్ల లక్ష్మి, యన్.శేషగిరిరావు సభ్యులుగా ఉంటారు. ఈ సమన్వయ సంఘానికి రామరాజు కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఈ సమావేశంలో ఎన్నికలను సమాయత్తమయ్యేందుకు ఏర్పాట్లు, కార్యకర్తల సమన్వయం గురించి చర్చించారు. అసెంబ్లీ ఎన్నికలలో జిహెచ్‌యంసి ప్రచార కమిటీలో నిర్వహించవలసిన బాధ్యతల దృష్ట్యా నియోజకవర్గ బాధ్యతల నుండితప్పుకుంటున్న శ్రీనివాసన్ ఇంతకాలం నియోజకవర్గ పార్టీకి చేసిన సేవలను గుర్తుచేస్తూ నియోజకవర్గ పార్టీ అధ్యక్షులు కొమ్ము సత్తయ్య అభినందించారు.

# సమాచార హక్కు చట్టంపై అవగాహన




భీమ మైదాన్ దగ్గర సాయిరామ్ హైస్కూల్ విద్యార్థులకు కవాడిగూడ డివిజన్ అధ్యక్షుడు బిట్ల నాగరాజు ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టం ఉద్యమకారుడు సయ్యద్ షా అలీ హుస్సేన్‌ని సమాచార హక్కు చట్టం – 2005 పై అవగాహనా తరగతులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ముషీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ లోక్‌సత్తా అభ్యర్థి కొంగర గంగాధరరావు మాట్లాడుతూ మన చుట్టూ జరుగుతున్న అవినీతిని బయటపెట్టే బ్రహ్మాస్త్రం 'సమాచార హక్కు చట్టం' అని దీనిని సాధించటంలో లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ మరియు అరుణరాయ్‌ల కృషి ఎంతో ఉందని అన్నారు. విద్యార్థులంతా ఈ చట్టం గురించి తెలుసుకుని తమ తల్లిదండ్రులకు, చుట్టుప్రక్కల వారికి అవగాహన కల్పించాలని ఉద్బోధించారు. స్కూల్ కరస్పాండెంట్ నరసింహ మాట్లాడుతూ తమ విద్యార్థులకు సమాచార హక్కు చట్టం గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించినందుకు లోక్‌సత్తా నాయకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి నందకుమార్, డివిజన్ ఉపాధ్యక్షులు మల్లేష్ యాదవ్, నాయకులు జయంత్‌సాయి, రాజు, వినోద్, ఆదిత్య, స్వామి, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

# లోక్‌సత్తా పార్టీలో చేరిన మైనారిటీ యువత




లోక్‌సత్తా పార్టీలో బేగంపేట్ డివిజన్‌కి చెందిన పలువురు మైనారిటీ యువత సభ్యత్వం తీసుకోని పార్టీలో చేరారు. ఈ సందర్భంగా లోక్‌సత్తా ఎంఎల్ఎ అభ్యర్థి హైమాప్రవీణ్ మాట్లాడుతూ... "మైనారిటీలకు కావాల్సింది మంచి ఉపాధి, విద్య అని" అది ఒక లోకసత్తా వాళ్ళ మాత్రమే సాధ్యమని, అందుకనే మైనారిటీ యువత లోక్‌సత్తా వైపు మొగ్గు చూపుతోందని అన్నారు. మైనారిటీలను ఓటు బ్యాంకులుగానే కాంగ్రెస్ ఇన్నాళ్ళు వాడుకుందని, గత పదేళ్లలో కాంగ్రెస్ మైనారిటీలకు చేసింది ఏమి లేదని కార్యదర్శి రాజీవ్ అన్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరినవారు ఇబ్రహీం, ఆఫ్తర్, మహమ్మద్ నవాజ్, మెహ్రాశ్, వసీం, ఆదిల్, సాజీద్, సయ్యద్, ఫెరోజ్, రశద్ యూసఫ్, సాబేర్ మరియు షకీల్. ఈ కార్యక్రమంలో లావణ్య, జానకిరామ్, రాజు, సాయి పాల్గొన్నారు.

# పార్క్ పరిసరాల పారిశుద్ధ్యానికి సంతకాల ఉద్యమం




లక్ష్మీనారాయణ యాదవ్ పార్క్ లోపల చూస్తే బ్రహ్మాండంగా ఉంటుంది. చుట్టుపక్కల సుమారు 30 కాలనీల నుండి ఉదయం, సాయంత్రం వందలాదిగా మహిళలు, యువత, పెద్దవాళ్ళు వాకింగ్‌కు వస్తుంటారు. కానీ, పార్క్ బయట టన్నుల కొద్ది చెత్త, కుక్కల స్వైరవిహారం, మలమూత్ర విసర్జనలతో భరించలేని విధంగా ఉండటం వల్ల చాలాకాలంగా ఇబ్బంది పడుతున్నామని స్థానికులు అన్నారు. ఈ విషయాన్ని స్థానిక నాయకుల దృష్టికి, యం.యల్.ఎ. దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేకపోయిందని వారు వాపోయారు. ఈ విషయాన్ని స్థానికులు లోక్‌సత్తా సనత్‌నగర్ డివిజన్ నాయకులు సాయిప్రకాష్ కప్పర దృష్టికి తీసుకొని వచ్చారు. వెంటనే స్పందించిన సాయి, పార్క్ వద్ద ఒక చెత్త కుండి, ఒక సులభ కాంప్లెక్స్ కొరకు సంతకాల సేకరణ మొదలుపెట్టారు. ఒక్కరోజులో 600 సంతకాలు సేకరించారు. ఈ సంతకాలతో స్థానిక డిసి కి వినతిపత్రం ఇవ్వనున్నట్లుగా హైమాప్రవీణ్ అన్నారు. ఈ కార్యక్రమంలో రాజీవ్, లావణ్య, జానకిరామ్, రాజు, సాయి పాల్గొన్నారు.

# మద్యం దుష్ప్రభావంపై విద్యార్థినులతో లోక్‌సత్తా ర్యాలీ




లోక్‌సత్తా పార్టీ ఇన్‌చార్జి రాంమోహన్ ఆధ్వర్యంలో మద్యం కలిగించే దుష్ప్రభావంపై నారాయణ కాలేజీ మహిళా విద్యార్థినులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్న వయసులోనే మద్యానికి అలవాటుపడి ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలు జీవనోపాధిలేక కూలీలుగా మారి వలసలు పోతున్నారన్నారు. గ్రామాల్లో ఉదయం 11.30 నుంచి 1.00 వరకు, సాయంత్రం 4.00 నుంచి 6.00 వరకు, జిల్లా స్థాయిలో ఉదయం 11.30 నుంచి సాయంత్రం 7.00 గంటల వరకు మాత్రమే విక్రయాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విధంగానైనా మద్యం మహమ్మరి బారిన పడకుండా కొందరినైనా కాపాడుకోవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నాగార్జున, కార్యదర్శి ఖలీల్, ఉషా, సారిక, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

# లోక్‌సత్తా ఆధ్వర్యంలో 10 బెల్టు షాపులు తొలగింపు




నెల్లూరు జిల్లాలో, గ్రామంలో, కాలనీలలో మద్యం బెల్టు షాపులు వెల్లువెత్తాయని లోక్‌సత్తా ప్రకటించింది. పేద ప్రజలు, కాలనీలు, కూలీలు ఎక్కడ ఎక్కువగా వుంటే వారినే కేంద్రంగా చేసుకొని పేద ప్రజల బ్రతుకులపై దెబ్బకొడుతూ మహిళల తాలిబోట్లతో, పిల్లల భవిష్యత్తులపై మద్యం బెల్టు షాపుల వ్యాపారం చేసుకుంటూ దోచుకుంటున్నారు. ఈ రోజు నెల్లూరు నగర పరిధిలోని ఆకుతోట, హరిజనవాడ, చింతారెడ్డిపాలెం, వడ్డెపాలెంలో ఉన్న దాదాపు 10 బెల్టుషాపులను తొలగించి వ్యాపారం చేస్తున్న వారి చేత ఇకపై మద్యం వ్యాపారం చేయబోమని లోక్‌సత్తా జిల్లా అధ్యక్షులు అంకయ్య చౌదరి వారిచేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మహిళాసత్తా బాధ్యులు పి.పుష్పలత, యల్.క్రిష్ణవేణి, ఎస్.కవిత, పార్టీ బాధ్యులు సి.పి.బాబురావు, పి.వి.ఎల్.రవికుమార్, వై.వి.కిషోర్, పి.రవికుమార్, ఎం.ఎస్.మణియాదవ్, వినోద్, బోడ్డు రవి తదితరులు పాల్గొన్నారు.


# పెన్షన్ కోసం మద్యం బాధితుల దరఖాస్తులు




లోక్‌సత్తా పార్టీ నగరశాఖ ఆధ్వర్యంలో ''గ్రీవెన్స్ డే'' సందర్భంగా నగరంలో బీదలు నివసించే కాలనీలలో మద్యం కారణంగా కుటుంబ యజమానిని పోగొట్టుకొని, అతి చిన్న వయసులోనే వితంతువులైన మహిళల బాధలను జిల్లా పరిషత్ కార్యాలయంలో అధికారుల దృష్టికి తీసుకొని వెళ్ళి వారి కుటుంబాలకు ప్రభుత్వ పరమైన ఆర్థిక మరియు ఉపాధి సదుపాయాలు కల్పించాలని కోరారు. వారి సలహామేరకు మున్సిపల్ కమీషనర్ కార్యాలయంలో వితంతు పెన్షన్ కొరకు దరఖాస్తులు చేయించారు.

గుంటూరు నగరంలో లోక్‌సత్తా పార్టీ నిర్వహించిన కొన్ని కాలనీలలో చేసిన సర్వేలో 500 కుటుంబాలలో కుటుంబ యజమాని త్రాగుడు వలన ఆరోగ్యం క్షీణించి మరణించిన వారే. వీరిలో 35 సం॥ల లోపు యువకులే ఎక్కువగా ఉన్నట్లు తేలింది. ఆ కుటుంబాలలో కేవలం 38 కుటుంబాలకు మాత్రమే నామమాత్రపు వితంతు పెన్షన్ రూ. 200/- అందుతున్నది. భర్తను కోల్పోయిన వారందరికి వెంటనే ప్రత్యేక కోటాలో వితంతు పెన్షన్‌ను మంజూరు చేయాలని, వారి కుటుంబాలను ఆదుకోవాలని లోక్‌సత్తా నగర అధ్యక్షురాలు జి.పద్మరాణి కమీషనర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి సత్యనారాయణ, జిల్లా నాయకులు మస్తాన్‌రావు, చిన వెంకయ్య, ఉమా మహేశ్వరరెడ్డి మరియు మీనాక్షి పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో సిటి స్కానింగ్ యంత్రాన్ని పునరుద్ధరించాలి




ప్రభుత్వ ఆసుపత్రిలో సిటి స్కానింగ్ యంత్రాన్ని పునరుద్దరించాలని నంద్యాలలోని లోక్‌సత్తా పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ ఆసుపత్రిలో సరియైన వసతులు లేక, సిటి స్కానింగ్ కోసం వచ్చే రోగులు వెనుతిరిగిపోతున్నారని, ప్రయివేటు ఆసుపత్రులలో సిటి స్కానింగ్ పరీక్షలకు ఎక్కువ డబ్బు చెల్లించుకోలేక ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలో పరిశుభ్రతను మెరుగుపరిచి, పందులను నివారించాలని, రోగుల కొరకు వచ్చే వారికి భోజనం చేయుటకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యం.వి.సత్యనారాయణ, యన్.ఎ.హామీద్, పుల్లారెడ్డి, వెంగళరెడ్డి, ప్రభాకర్, యస్.యం.వలి, జి.వి.రమణ, ఇక్బాల్, కరీం, వెంకటేశ్వర్లు, జిలాని, చైతన్య, మహమ్మద్ అలీ, బషీర్, సోమన్న, వాహిద తదితరులు పాల్గొన్నారు.

# విలువలతో కూడిన రాజకీయాలు రావాలి

**గజపతినగరం**

విలువలతో కూడిన రాజకీయాలను తీసుకురావాల్సిన అవసరం ఉందని నియోజకవర్గ లోక్‌సత్తా పార్టీ ఇన్‌చార్జి దేవర ఈశ్వరరావు తెలిపారు. ఆయన కనిమెరక గ్రామంలో జరుగుతున్న ఉపాధి కూలీలతో మాట్లాడారు. కొంతమంది ఎన్నికల్లో గెలవడానికి కొత్త కొత్త ఎత్తుగడలతో ప్రజలను మరోసారి మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. గొలుసు దుకాణాలు మూసివేయాలని, ప్రజాధనాన్ని కాపాడటానికి ఏ పార్టీ ముందుకు రావడం లేదన్నారు. మద్యం తాగి మృతిచెందిన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. వారి కుటుంబాలకు రూ. 2 వేలు పింఛను ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కరపత్రాలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఎం.ఎస్.రాజు తదితరులు పాల్గొన్నారు.

# దోచుకున్న వారికి దోచుకున్నంత...

**పత్తికొండ**



పత్తికొండ మండలంలోని పులికొండ గ్రామంలో వెలసిన శ్రీ రంగనాథ స్వామి గుడిలో దోచుకున్నోళ్లకు దోచుకున్నంత అన్న చందంగా ఉందని లోక్‌సత్తా జిల్లా ఉపాధ్యక్షులు ఆనందాచారి, నియోజకవర్గ ఇన్‌చార్జి నాగేంద్రలు పేర్కొన్నారు. పులికొండ రంగనాథ స్వామి ఆలయంలో జరుగుతున్న అక్రమాల గురించి ఆరోపణలు రావడంతో, వారు దేవాలయాన్ని సందర్శించి వసతులను పరిశీలించారు. గ్రామస్తులతో గుడిలో జరుగుతున్న విషయాలపై ఆరా తీశారు. దేవాలయంలో భక్తులకు కనీస వసతులు కరువయ్యాయన్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చే మహిళా భక్తులకు సరైన మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆలయానికి అధిక మొత్తంలో ఆదాయం సమకూరుతున్నా వసతుల కల్పనలో ఆయన ధర్మకర్త నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. దీనిపై విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ నాయకులు ప్రసాద్, శ్రీనివాసులు, పీరమొద్దీన్, ఎర్రి స్వామి, నాగరాజు, లక్ష్మణస్వామి పాల్గొన్నారు.

# మంచినీటి సమస్య పరిష్కారానికి కృషి

**కూకట్‌పల్లి**

కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలో ఎక్కడ మంచినీటి సమస్య ఉన్నా సత్వర పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నానని ఎమ్మెల్యే డా॥ జయప్రకాష్ నారాయణ్ పేర్కొన్నారు. మోతీనగర్ డివిజన్ తులసీనగర్‌లో రూ. 9.70 లక్షల వ్యయంతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను ఆయన స్థానిక కార్పొరేటర్ సయ్యద్ బాబుతో కలిసి ప్రారంభించారు. అనంతరం జేపీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో మరే ఇతర నియోజకవర్గంలో లేని విధంగా ఆరువేల వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పింఛన్లు, మూడువేల రేషన్‌కార్డులు ఇప్పించనన్నారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ నేతలు కొమ్ము సత్తయ్య, ఎస్.శ్రీనివాసన్, వంశీ ప్రసాద్, సహాయ కార్యదర్శి కొండల్‌రెడ్డి, శ్రీనివాసులు, డివిజన్ అధ్యక్షులు యస్.డి.వాసు, మోహన్‌క్రిష్ణ, వెంకటేష్, సుబ్రహ్మణ్యం, ప్రకాష్‌రావు, శ్రీలత, కోమలాదేవి, సరస్వతి, లక్ష్మీతులసి తదితరులు పాల్గొన్నారు.



మోతీనగర్‌లో సామాజిక భవనం ప్రారంభోత్సవ దృశ్యాలు



సనత్‌నగర్‌లో మహిళ సాధికారత సదస్సు



కర్నూలులో సభ్యత్వ నమోదు కార్యక్రమం



నెల్లూరులో ఎల్.ఎస్.పురం కాలనీలో ముఖాముఖీ



చిలకలూరిపేటలో జాబ్ మేళా



రాయదుర్గంలో నేను సైతం కార్యక్రమం



పత్తికాయవలసలో గ్రంథాలయ ప్రారంభం

RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2013-15 Published on 16th February, 2014




To,

**Book-Post**

PRINTED MATTER

If not delivered please return to:

Lok Satta Times

8-2-674B/2/9, Plot No. 93

Happy valley, Road No. 13A

Banjara Hills, Hyderabad - 500 034

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad